సూర్య 17వ వసంతంలోకి... www.suryaa.com



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
ప్రజ్ఞ
APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్ఎడిషన్
www.suryaepaper.com చూడండి.



visit us @ http://epaper.suryaa.com
సంపుటి 17 | సంచిక 175
బుధవారం | 22 మే 2024 | హైదరాబాద్
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, వైశాఖ మాసం శుద్ధ. చతుర్దశి సా.5.54, స్వాతి ఉ.7.14, వర్జ్యం మ.1.12 నుంచి 2.54 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం ఉ.11.30 నుంచి 12.21 వరకు

## ఇండియా కూటమి పాపాలతో
# దేశం పురోగమించ లేదు



ఈస్ట్ చంపరాన్: విపక్ష పార్టీల సారథ్యంలోని 'ఇండియా' (..్యా...) కూటమిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ( ) విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. 21వ శతాబ్దపు భారతదేశాన్ని 'ఇండి' కూటమి పాపాలు ముందుకు తీసుకువెళ్లలేవని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఆరో విడత ప్రచారంలో భాగంగా బీహార్ ()లోని ఈస్ట్ చంపరాన్‌లో మంగళవారంనాడు జరిగిన ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, టుక్డే టుక్డే గ్యాంగ్‌పై జూన్ 4న కీలక నిర్ణయం రాబోతోందన్నారు. ఇంతవరకూ జరిగిన ఐదు విడతల పోలింగ్‌లో 'ఇండి' కూటమి పూర్తిగా ఓటమిపాలైందన్నారు. ఇండియా కూటమి పాపాలతో 21వ శతాబ్దపు భారతదేశం పురోగమించలేదని, ఆ కారణంగానే ప్రతి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, ఆర్జేడీ వంటి పార్టీలకు గట్టి గుణపాఠం చెబుతున్నారని అన్నారు.

**60 ఏళ్లపాటు దేశాన్ని కాంగ్రెస్ పతనం చేసింది**

కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీలు దేశాన్ని 60 ఏళ్ల పాటు ధ్వంసం చేశాయని, మూడు, నాలుగు తరాల జీవితాలను నాశనం చేశాయని మోదీ విమర్శించారు. "60 ఏళ్లలో ఈ వ్యక్తులు భారీ ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. స్విస్ అకౌంట్లు తెరిచారు. మీ పిల్లలకు చదువుకునేందుకు స్కూళ్లులేవు. వారి పిల్లలు మాత్రం విదేశాల్లో చదువులు కొనసాగించారు. పేదల కష్టాల పాలయ్యారు" అని అన్నారు.

**మోదీ బెడ్ రెస్ట్ కామెంట్‌పై...**

ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌పై ప్రధానమంత్రి మోదీ పరోక్ష విమర్శలు చేస్తూ, జూన్ 4 తర్వాత మోదీ బెడ్ రెస్ట్ తీసుకుంటారని ఇక్కడ ఒకరు అన్నట్టు తన దృూఎష్టికి వచ్చిందన్నారు. అయితే దేశంలోని ఏ ఒక్కరూ తమ జీవితంలో బెడ్ రెస్ట్ తీసుకోకూడదని తాను భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. దేశ ప్రజలంతా పూర్తి శక్తిసామర్థ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. "జంగిల్ రాజ్ వారసుల నుంచి ఇంతకంటే ఏమి ఆశిస్తాం. మోదీని ఆడిపోసుకోవడం మినహా ఈ ఎన్నికల్లో వాళ్లు మాట్లాడేందుకు ఎలాంటి అంశాలు లేవు" అని మోదీ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఏడు విడతల లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆరో విడత పోలింగ్ జూన్ 25న జరుగనుంది.

## స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద
# భారీ బందోబస్తు



ఎన్నికలు అనంతరం ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద మూడంచెల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ పీహెచ్డీ రామకృూఎష్ణ వెల్లడించారు. నగరంలోని కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం హింస ఎక్కడా చెలరేగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫలితాలు వచ్చిన తర్వాత కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్ర త్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువగా ఘర్షణలు జరిగాయన్నారు. ఓట్ల లెక్కింపు పారదర్శక, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. శాంతి, భద్రతలపరంగా సమస్యలు సృూ ఎష్టించిన 109 మందిని గుర్తించామనీ, త్వరలో వారిని బైండోవర్ చేస్తామని వివరించారు. పది మందిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు.

## అనంత జిల్లాలో
# ఎన్ఐఏ సోదాలు



3 లో

● ఉగ్రవాదులతో లింక్స్‌పై ఆరా ● ఓ రిటైర్డ్ హెచ్ఎం ఇంట్లో అధికారులు తనిఖీలు

అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని ఆత్మకూర్ వీధికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఇంట్లో ఎన్ఐఏ అధికారులు మంగళవారం ఉదయం సోదాలు చేశారు. కొందరు యువకులకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## ఉత్తరాంధ్రకు
# రెండోసారి సీఎస్



3 లో

● సీక్రెట్‌గా టూర్.. ఏం జరుగుతోంది..? ● వేసవి తాగునీరు సమస్యను పక్కనబెట్టిన వైనం ● ఎయిర్‌పోర్టు నిర్మాణాల పనులపై ఆదరాబాదరగా సమీక్ష

## పల్నాడులో చాలా
# మంది పారిపోయారు

● మగవాళ్లు ఊరొదిలి ఎందుకు వెళ్లారని పోలీసుల ఆరా ● గుడిలో దాక్కునే పరిస్థితులలో ఆడవారు ● నేటికీ ఉద్రిక్తంగానే జిల్లాలలో పరిస్థితులు ● ఎలక్షన్ తర్వాత హింస చెలరేగడం ఆందోళన కలిగించేదే



3 లో

పల్నాడులో పోలింగ్ అనంతరం జరిగిన దాడులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగించాయి. మూక దాడులు, వాహనాల దహనం, రాళ్ళ దాడులు నుంచి పెట్రోల్ బాంబు దాడులతో దద్దరిల్లింది పల్నాడు. ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా, ఆటవిక పాలనలో కొనసాగుతున్నామా అన్న సంశయము కలిగించింది. ఈ ప్రతీకార దాడులు చూస్తుంటే పార్టీ నాయకులు ఫ్యాక్షన్ లీడర్లుగా మారారన్న భావన కలగక మానదు. పల్నాడు ప్రాంతంలో పోలింగ్ రోజు ఉద్రిక్తంగా ఉండటం సహజం. కానీ ఈ సారి ఈ ప్రాంతంలో ఎలక్షన్ తర్వాత హింస చెలరేగడం ఆందోళన కలిగిస్తోంది. పోలింగ్ జరుగుతున్న సమయంలో బూత్ ల పరిశీలనకు వచ్చిన నర్సారావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృూఎష్ణ దేవరాయలతో ప్రారంభమైన దాడి యత్నాలు ఆ తర్వాత మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృూఎష్ణా రెడ్డి, ప్రత్యర్థి టీడీపీ అబ్యర్థి జూలకంటి బ్రహ్మ రెడ్డి వరకు కొనసాగింది. సత్తెనపల్లి లో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ... వైసీపీ అభ్యర్థి మంత్రి అంబటి రాంబాబు ఎదురు పడిన సందర్భంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నర్సారావుపేట టీడీపీ అభ్యర్థి డా.అరవింద బాబు మునిసిపల్ హైస్కూల్ లో టింగ్ సరళి పరిశీలించేందుకు వెళ్ళిన సదర్భంలో వైసీపీ శ్రేణులు దాడి చేశారు. అప్పటికి పోలింగ్ సమయం పూర్తి కావడంతో ఇక గొడవలు ఉండవని భావించారు. అయితే అంచనాలు తలకిందులు చేస్తూ ఒక్క సారిగా హింస చెలరేగింది.



7 లో

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో
# ఏసీపీ ఉమామహేశ్వరరావు అరెస్ట్

● ఏసీపీ ఉమామహేశ్వరరావు నివాసంలో ఏసీబీ సోదాలు ● మరో ఏడు చోట్ల కూడా సోదాలు ● రూ.3 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం ● ఏసీపీ ఉమామహేశ్వర రావును నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న ఏసీబీ

## కిర్గిస్థాన్‌లో కొనసాగుతున్న
# విద్యార్థుల కష్టాలు

● ఘటనలపై ఆరా తీసిన తెలంగాణ సీఎం రేవంత్ ● ఇంకా టెన్షన్ కొనసాగుతున్న వాతావరణం ● విదేశీ విద్యార్థులు ఉన్న ప్రాంతాల్లో భద్రతను పెంపు ● వారంతా హాస్టల్ గదులకే పరిమితం కావాల్సిన పరిస్థితులు



3 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## అంతా ఇంతే!



తెలంగాణలో కాంగ్రెస్ రావాలని మొక్కుకున్నారేమో

## వారణాసిలో ఏపీ బీజేపీ
# ముఖ్య నేతల ప్రచారం

● ప్రధానికి రికార్డు మెజార్టీనే లక్ష్యం ● తెలుగు కమ్యూనిటీతో ప్రత్యేకంగా సమావేశాలు ● ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి కీలక భూమిక

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పోటీ చేస్తున్న వారణాశి నియోజవకర్గంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ ముఖ్య నేతలు ప్రచారం చేస్తున్నారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఈ ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారణాశి నియోజకవర్గం అంటే మినీ ఇండియా. అక్కడ అన్ని రాష్ట్రాలకు చెందిన వారు నివసిస్తూ ఉంటారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారు కొన్నివేల మంది ప్రజలు, స్థానికంగా నివాసం ఏర్పరచుకున్న భక్తులు పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అక్కడే స్థిరపడిపోయారు. వీరంతా అక్కడి ఓటర్లుగా ఉన్నారు.



3 లో

## సీఎస్‌తో డీజీపీ భేటీ



3 లో

● సిట్ నివేదికపై ఈసీ ఆదేశాలు వస్తే ఏం చేద్దాం? ● ఎన్నికల అనంతరం జరిగిన హింసపై సిట్ నివేదిక ● కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన సీఎస్ జవహర్‌రెడ్డి

రాష్ట్రంలో ఎన్నికల రోజు, అనంతరం జరిగిన హింసపై సిట్ నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన నేపథ్యంలో సీఎస్ జవహర్‌రెడ్డితో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా భేటీ అయ్యారు. మంగళవారం సచివాలయంలో ఇద్దరు ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. సిట్ ప్రాథమిక నివేదికపై ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వస్తే తీసుకోవాల్సి చర్యలపై ఇరువురు చర్చించినట్టు సమాచారం.

సూర్య
హైదరాబాద్
బుధవారం
22 మే 2024





# పిన్నెల్లి ఏ తప్పూ చేయకపోతే ఎందుకు పారిపోయారు

గుంటూరు నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి : హింసను ప్రేరేపించేలా అనేక వేదికల్లో మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని టీడీపీ నేతలు లావు శ్రీకృష్ణదేవరాయలు, జూలకంటి బ్రహ్మారెడ్డి ఆరోపించారు. గుంటూరులో వారు మీడియా సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లాలో హింసపై ముందుగానే అప్రమత్తం చేశాం. ఈసీ, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. ఈసీ కేవలం సమస్యాత్మక ప్రాంతాలను ప్రకటించి మౌనంగా ఉంది. ఎన్నికల తర్వాత దాడులు చేస్తామని పిన్నెల్లి పదేపదే హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై పోలీసులు చర్యలు తీసుకోలేదు. ఎన్నికలు పూర్తయ్యాక పిన్నెల్లిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. అయినా తప్పించుకుని హైదరాబాద్ పారిపోయారు. అక్కడ మీడియాతో మాట్లాడినా పిన్నెల్లిపై చర్యలు లేవు. ఆయనపై పోలీసులు ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పిన్నెల్లి ఏ తప్పూ చేయకపోతే ఎందుకు పారిపోయారు? ఆయన ఇంట్లో ఆయుధాలు ఎందుకు ఉన్నాయో చెప్పాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై మాచర్లలో దాడులు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూములను పిన్నెల్లి కబ్జా చేశారు. మాచర్ల నియోజకవర్గంలో వైకాపా మూకలు దాడులు చేశాయి. ఈ దాడుల్లో 74 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు గాయపడ్డారు. దాడి చేసి పోలీసు అధికారులకు కులం అంటగట్టి మాట్లాడతారా? అధికారుల జాబితా పంపింది. నియమించింది మీ ప్రభుత్వమే కదా? అని జూలకంటి ప్రశ్నించారు.

పిన్నెల్లి పుట్టిన రోజు వేడుకలకు పోలీసులు వెళ్లారు : ప్రజలు భారీగా తరలివచ్చి వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. 85 శాతానికిపైగా పోలింగ్‌తో వైసీపీ తట్టుకోలేకపోతోంది. ఆ పార్టీ దాడుల్లో గాయపడిన వారికి నేర చరిత్ర లేదు. టీడీపీ తరపున ఏజెంట్లుగా కూర్చోవడమే వారు చేసిన తప్పా? రెంటాలలో ముంజులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

## గ్రామ స్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్‌కు
# కార్యాచరణ ప్రణాళిక

విశాఖపట్నం, సూర్య బ్యూరో ప్రతినిధి: గ్రామ స్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్కు కార్యాచరణ ప్రణాళికను వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం చేస్తోందని, ఈ క్రమంలోనే రాష్ట్ర స్థాయిలో శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించామని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. అగనంపూడిలోని హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ సెంటర్ లో మంగళవారం నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రివెంటివ్ అంకాలజీపై కమ్యూనిటీ హెల్త్ మెడిసిన్, గైనకాలజీ, ఇఎన్టి, డెంటిస్ట్రీ, పేథాలజీ, సర్జరీ విభాగాల్లో పాల్గొన్న ప్రభుత్వ వైద్య కళాశాలల వైద్య నిపుణులకు నిర్వహించిన సెన్సిటైజేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో శిక్షణ ఇచ్చేందుకు మంచి మానవ వనరులున్నాయన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వైద్య నిపుణులు జిల్లా స్థాయిలో శిక్షణివ్వాలనీ, తిరిగి వారు ఎఎన్ ఎం, సిహెచ్వోలకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతచేయాలన్నారు. సిహెచ్వోలు(గతంలో ఎంఎల్హెచ్పిలు) ముందుగా స్క్రీనింగ్ చేసి సంబంధిత మెడికల్ ఆఫీసర్కు రిఫర్ చేయాలన్నారు, అటు తర్వాత రిఫర్ చేసిన కేన్సర్ కేసుల విషయంలో ప్రభుత్వ వైద్య కళాశాల్లోని వైద్య నిపుణులు కలుగజేసుకోవాల్సిన అవసరం ఉందన్నా యరు. మీరు సెకండరీ హెల్త్ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్ల కు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ విషయంలో ఏపీ వైద్య ఆరోగ్య శాఖ ముందునుంచే ప్రయత్నం చేస్తోందన్నారు.దీన్ని విజయవంతం చేసేందుకు విలువైన సలహాల్ని ఇవ్వాలని ఈ సందర్భంగా వైద్య నిపుణుల్ని ఆయన కోరారు. ఏపీలో శిక్షనిచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖలో తగిన మానవ వనరులున్నాయన్నారన్నారు. స్టేట్ కేన్సర్ స్క్రీనింగ్ పాలసీ పై చర్చించే ప్రయత్నం చేద్దామన్నారు. బ్రెస్ట్ కేన్సర్ , సర్వైకల్ కేన్సర్ మరియు ఓరల్ కేన్సర్ విషయంలో ఇప్పుడు స్క్రీనింగ్ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ సుముఖంగా ఉందన్నారు. హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంతిశెట్టి, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ రవితేజ, ఎన్సీడీ స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్యామల, డాక్టర్ అనిల్ కుమార్ (డిఎంఇ నోడలాఫీసర్), కన్సల్టెంట్ రాజ్ కిరణ్ తదితరులు కమీషనర్, ఎండీ ఎన్హెచ్ఎం డాక్టర్ వెంకటేశ్వర్ వెంట ఉన్నారు.

హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్లో కలియ తిరిగిన కమీషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ : శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్, నేషనల్ హెల్త్ మిషన్ ఏపీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ హోమీ బాబా కేన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్లో కలియ తిరిగారు. కేన్సర్ కు సంబంధించి ఇక్కడ అందుబాటులో అన్ని అధునాతన విభాగాలన్నింటినీ ఆయన పరిశీలించారు.

# ప్రశాంత్ కిశోర్ ఏమైనా బ్రహ్మా?

## మంత్రి బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి : రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్, ఎన్నికల కన్సల్టెన్సీ లపై మంత్రి బొత్స సత్యనారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రశాంత్ కిషోర్ ఏమైనా బ్రహ్మనా? ఎన్ని సీట్లు వస్తాయో చెప్పడానికి అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రశాంత్ కిషోర్ ఓ క్యాష్ పార్టీ. గిమ్మిక్కులు చేస్తారని విమర్శలు గుప్పించారు. ప్రశాంత్ కిషోర్ కమర్షియల్ అని తెలుసుకునే వద్దనుకున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ కోసం ఐప్యాక్ నిర్మాణాత్మకంగానే పనిచేస్తోందని అన్నారు మంత్రి బొత్స. ప్రశాంత్ కిషోర్ అయినా,ఐప్యాక్ అయినా తాత్కాలికమేనని, వైఎస్సార్‌సీపీ శాశ్వతమని తెలిపారు. కో ఆర్డినేషన్ కోసం ఐప్యాక్ సంస్థ సేవలు తీసుకున్నామని చెప్పారు. కన్సల్టెన్సీ సంస్థలు ఎన్నైనా చెబుతాయని, నిర్ణయం తీసుకోవాల్సింది తామేనని అన్నారు. ఐప్యాక్ చెప్పిన వారికి టిక్కెట్లు ఇచ్చారనేది అవాస్తవని అన్నారు. ఐప్యాక్ ఓ జాబితా ఇస్తుందని,అందులో నుంచి అభ్యర్థులను పార్టీ సెలెక్ట్ చేసుకుందని స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తయ్యాయి. భవితవ్యం బ్యాలట్ బాక్సులలో ఉన్నాయి. మేం గెలుస్తామని, జూన్ 9 న ప్రమాణ స్వీకారం అని చెప్పాం. ఏపీలో విద్యావిదానంపై మా విధానాన్ని మ్యానిఫెస్టోలో పెట్టాం. ప్రతిపక్ష పార్టీలు మా విద్యావిధానం నచ్చకపోతే ఎందుకు వారి విధానాన్ని మేనిఫెస్టోలో పెట్టలేదు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 38,61,198 మంది చదువుతుంటే వాస్తవ విరుద్ధంగా 35 లక్షలే ఉన్నారని ఇచ్చారు. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీస్థాయిలో రాణించేలా ఎన్నోలక మార్పులు తెచ్చాం. ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్య, టోఫెల్, జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, విద్యాకానుక, విదేశీ విద్యాదీవెన్ ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు.

మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం : విద్యావ్యవస్థపై ఎందుకు తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారు. మాపై బురద జల్లుతున్నారు. విద్యావ్యవస్థలో ఇంకా మంచి మార్పులు తీసుకురావాలని మా ఆలోచన. మా విధానాలు నచ్చే పెద్ద ఎత్తున్నాకు అనుకూలంగా ఓటేశారని భావిస్తున్నాం. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారు. నేను ఎన్నో ఎన్నికలు చూశాను కానీ ఇలాంటి పరిస్థితులు ఎవుడూ చూడలేదు. ప్రదాన పార్టీ నాయకులంతా ప్రస్తుతం విదేశాలలో ఉన్నారు. సీఎం వైఎస్ జగన్ ఫ్యామిలీతో విదేశాలకు వెళ్లారు. వాతావరణం అనుకూలించక మద్యలో ఆగితే తప్పుడు ప్రచారాలు ఎందుకు?. చంద్రబాబు చెప్పాపెట్టకుండా విదేశాలకి వెళ్లారు. చంద్రబాబు ఏ దేశం వెళ్లారో కూడా తెలియదు. చంద్రబాబు ఏ దేశం వెళ్లారో చెప్పాలి. చంద్రబాబు కంటే ముందే ఆయన కుమారుడు లోకేష్ విదేశాలికు వెళ్లారు. రాష్ట్ర ప్రజలని సంయమనం పాటించాలని కోరుతున్నా. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు ఆపాలని కోరారు.


భయంతో చంద్రబాబు విదేశాలకు పారిపోయారా? : రాష్ట్ర అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులమే. ఎందుకు హర్రీ అండ్ వర్రీ. చంద్రబాబు ప్రజలకి చెప్పి విదేశాలకు వెళ్తే తప్పేంటి?. ఎందుకు చెప్పకుండా చంద్రబాబు విదేశాలకి వెళ్లారు. భయంతో చంద్రబాబు విదేశాలకు పారిపోయారా?. సీఎం జగన్ విదేశీ పర్యటనలపై ఎందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అమెరికాలో నివాసం ఉన్న డాక్టర్ గన్నవరంలో హల్ చల్ చేయడం ఏంటి? వైఎస్ జగన్ అడ్డుకోవాలని మెసేజ్‌లు పెట్టడం. డిబేట్లు ఏంటి? ఈ తరహా కల్చర్ ఎవుడూ లేదు. తన పాలన చూసి ఓటేయాలని ప్రధాని మోడీ నే అడగలేదు. మాకు 175 సీట్లు వస్తాయని అనుకుంటున్నా. మేనిఫెస్టోని చూసి ఓటేయమని ఏ సీఎం అయినా చెప్పారా?. తన పాలన చూసి ఓటేయాలని ప్రదాని మోదీనే అడగలేకపోయారు. మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయమని సీఎం జగన్ మాత్రమే అడిగారు సీఎం రాజకీయాలలో ట్రెండ్ సెట్ చేశారు.

## వైసీపీ కార్యకర్తలంతా
# సంబరాలకు సిద్ధం కావాలి



అమరావతి : టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని విధ్వంసాలు సృష్టించినా, రాష్ట్రంలో వైసీపీ విజయాన్ని అడ్డుకోలేరని మంత్రి జోగి రమేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వైసీపీ గెలువు ఖాయమని, వైసీపీ కార్యకర్తలంతా సంబరాలకు సిద్ధం కావాలని పిలువునిచ్చారు. చంద్రబాబు ఎల్లో మీడియాకు కూడా చెప్పకుండా ఎక్కడికి వెళ్లారని జోగి రమేశ్ ప్రశ్నించారు. దోచుకున్న డబ్బును దాచుకునేందుకు దుబాయ్ వెళ్లారా? అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు పరారీతో టీడీపీ నేతల నోటికి తాళాలు పడ్డాయని ఎద్దేవా చేశారు. ఇక, పురందేశ్వరి ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం అందించారని, అందువల్లే అధికారులను మార్చారని మంత్రి జోగి రమేశ్ ఆరోపించారు. అధికారులను మార్చిన చోటే గొడవలు జరిగాయని అన్నారు. టీడీపీ ఓటమి ఖాయం కావడంతో చంద్రబాబు పల్నాడులో అల్లర్లకు తెరలేపారని ఆరోపించారు.

## వైసీపీ నేతలు హింసకు
# పాల్పడుతున్నా వారిపై కేసుల్లేవు



అమరావతి : గత రెండేళ్లుగా మాచర్లలో వైసీపీ నేతలు హింసకు పాల్పడుతున్నా వారిపై పోలీసు కేసులు నమోదు చేయడంలేదని టీడీపీ నేత కనకమేడల రవీంద్రకుమార్ ధ్వజమెత్తారు. తప్పనిసరి పరిస్థితులు వస్తే నామమాత్రపు కేసులు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్నిలకు ముందే 100 హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని, మాచర్లలో టీడీపీ కార్యకర్త గొంతు కోసి చంపారని వివరించారు. సీఎస్ జవహర్ రెడ్డి, ఆనాటి డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు కనుసన్నల్లోనే ఈ దాడులు జరిగాయని కనకమేడల ఆరోపించారు. వైసీపీ రాజకీయ కుట్రలో భాగంగానే ఈ ఘటనలు జరిగాయని అన్నారు. సిట్ లోతుగా దర్యాప్తు చేయాలని, తద్వారా అసలు కుట్రదారులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

# మే 13న వైసీపీకి సమాధి కట్టేశారు..!

● జూన్ 4న వైసీపీకి పెద్దకర్మ ● విశాఖలో రఘురామ రాజు సంచలన వ్యాఖ్యలు



విశాఖపట్నం, మే 21, మేజర్‌న్యూస్ : వైసీపీకి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని జూన్ 4వ తేదీన ఆ పార్టీకి పెద్ద కర్మ అని ఉండి టీడీపీ అభ్యర్థి రఘురామ కృష్ణంరాజు సంచలన ఆరోపణలు చేశారు. ఉత్తరాంధ్రలో పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం విశాఖ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజుతో కలసి సీతమ్మధారలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన వైసీపీని ప్రజలు తిరస్కరించి సమాధి కట్టేశారని, ఒకవిధంగా ఆ పార్టీ 13వ తేదీన చనిపోయిందని తెలిపారు. జూన్ 4వ తేదీన సీఎం జగన్‌కు దిమ్మదిరిగే ఫలితాలు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఫలితాలు చూసి వైసీపీకి ఆ రోజు పెద్ద కర్మ నిర్వహించాల్సి ఉంటుందని సెటైర్లు వేశారు. జగన్‌కు త్వరలోనే రిటర్న్ గిఫ్ట్ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

నరకం చూపించారు...!

వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకు నరకం చూపించారని రఘురామ కృష్ణంరాజు అన్నారు. పుట్టి పెరిగిన తన ఊరు వచ్చేందుకు నాలుగేళ్ల సమయం పట్టిందని పేర్కొన్నారు. ఆఖరికి హైదరాబాద్‌లో అరెస్ట్ చేయించారని.. జగన్‌లో ఓ ఉన్మాది ఉన్నాడని విమర్శించారు. ఉన్మాదికి అధికారం దక్కడంతో కొందరిని టార్గెట్ చేశారని రఘురామ వెల్లడించారు. తాను ఒక్కడినే కాదు.. చాలామందిని జగన్ వేధించారని, చివరికి కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజు లాంటి సౌమ్యుడిని కూడా జగన్ వదల్లేదని గుర్తుచేశారు

కూటమి విజయం పక్కా ...!

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయంపై రఘురామ ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీలకు 120 నుంచి 125 సీట్ల వరకు వస్తాయన్న విశ్వాసం ఉందన్నారు. కూటమి నేతృత్వంలో ఏర్పడే ప్రభుత్వానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో వైసీపీ గెలుస్తోందని ఆ పార్టీ నేతలు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని రఘురామ ధ్వజమెత్తారు. జగన్ రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని ముహూర్తం కూడా ప్రకటించారని కానీ ఆ ముహూర్తానికి వైసీపీ పార్టీ భూస్థాపితం అవుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# ఏపీలో అరాచకాలు జరుగుతుంటే జగన్, చంద్రబాబు విదేశాలకు వెళ్లడం ఏంటి?



అమరావతి : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఏపీ రాజకీయ పరిణామాలపై స్పందించారు. రాష్ట్రంలో అల్లర్లు, అరాచకాలు జరుగుతుంటే జగన్, చంద్రబాబు విదేశాలకు వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. నాయకులకు ఉండాల్సిన లక్షణం ఇది కాదని అన్నారు. జగన్ లండన్ వెళ్లారని, చంద్రబాబు అమెరికా వెళ్లారని... వారిద్దరిదీ బాధ్యతా రాహిత్యమని విమర్శించారు. ఏపీలో అల్లర్లపై సిట్ వేయడం వల్ల ఉపయోగం లేదని, ఇటీవలి హింసపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరిగిన ఘటనలపై జ్యుడిషియల్ విచారణ జరగాలని స్పష్టం చేశారు.

# వారికి సీఆర్పీసీ 41 నోటిసులిచ్చాం



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. 301 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సోదాల నిర్వహించినట్లు తెలిపారు. సోదాల్లో ఎలాంటి పత్రాలు లేని 1104 వాహనాలు జప్తు చేసినట్లు చెప్పారు. 482 లీటర్ల నాటుసారా, 33.32 లీటర్ల మద్యం, 436 లీటర్ల నాన్ డ్యూటి లిక్కర్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఎన్నికల రోజు, అనంతరం జరిగిన పరిణామాల్లో నమోదైన కేసుల్లో 1522 మందిని గుర్తించామన్నారు.కొంత మందికి 41 సీఆర్ పీసీ కింద నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు. ఎన్నికల రోజు నమోదైన కేసుల్లో 2790 మందిని గుర్తించి పలువురిని అరెస్టు చేశామన్నారు. ఎన్నికల అనంతరం నమోదైన కేసుల్లో 356 మందిని గుర్తించి పలువురిని అరెస్టు చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేసుల్లో గుర్తించిన 85 మంది ముద్దాయిలపై హిస్టరీ షీట్లు ఓపెన్ చేశామన్నారు. ముగ్గురిపై పీడీయాక్ట్, మరో ఇద్దరిని బహిష్కరించేందుకు సిఫార్స్ చేశామని డీజీపీ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తిస్తే 112,100 కు డయల్ చేసి వివరాలు తెలిపితే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.

# సిట్ నివేదికపై ఈసీ ఆదేశాలు వస్తే ఏం చేద్దాం?

వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ఎన్నికల రోజు, అనంతరం జరిగిన హింసపై సిట్ నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన నేపథ్యంలో సీఎస్ జవహర్‌రెడ్డితో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా భేటీ అయ్యారు. మంగళవారం సచివాలయంలో ఇద్దరు ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. సిట్ ప్రాథమిక నివేదికపై ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వస్తే తీసుకోవాల్సి చర్యలపై ఇరువురు చర్చించినట్టు సమాచారం. ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఏర్పాటైన సిట్ దర్యాప్తులో పోలీసుల వైఫల్యాలు వెలుగుచూశాయి. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో రెండు రోజులుగా విస్తృతంగా పర్యటించిన సిట్ బృందాలు 6 నియోజకవర్గాల పరిధిలో తీవ్ర హింసాత్మక ఘటనలకు సంబంధించి నమోదైన 33 కేసులను పరిశీలించాయి. వీటికి సంబంధించిన 150 పేజీల సమగ్ర నివేదికను సిట్ అధిపతి వినీత్ బ్రిజ్‌లాల్, ఎస్పీ రమాదేవి సోమవారం సాయంత్రం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు అందజేశారు. ఆయన ఈ నివేదికను ఎన్నికల సంఘానికి పంపించిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో సిట్ నివేదిక కలకలం రేపుతోంది. ఈసీ నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయోనని పోలీసుశాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది.

# ఉపాధి పనుల నిర్వహణకు తగిన చర్యలు

● ఉపాధిహామీ, స్వచ్ఛభారత్ అనుసంధానంతో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణం చేయాలి ● ఇసి అనుమతితో ఉపాధి హామీ పనులను పెద్దఎత్తున చేపట్టండి ● ఉపాధి హామీ పనుల్లో వాటర్ కన్జర్వేషన్ పనులకు అధిక ప్రాధాన్యతనివ్వాలి ● తాగునీరు,విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తితే తక్షణం పరిష్కరించండి ● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి



అమరావతి నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి :రాష్ట్రంలో ఉపాధిహామీ,స్వచ్ఛ భారత మిషన్ అనుసంధానంతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పెద్దఎత్తున చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలక్టర్లను ఆదేశించారు. తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై మంగళవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణకు ప్రస్తుతం మంచి అనువైన సీజన్ కావున పెద్ద ఎత్తున ఉపాధి పనులు నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో లక్షకు పైగా వ్యక్తిగత మరుగు దొడ్లను మంజూరు చేశామని కావున ఉపాధి హామీ,స్వచ్ఛ భారత్ మిషన్ అనుసంధానంతో వాటికి సోక్ పిట్లను నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉపాధిహామీ పనుల్లో వాటర్ కన్జర్వేషన్ పనులకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని ఆదేశించారు.తదుపరి తాగునీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై సిఎస్ జవహర్ రెడ్డి కలక్టర్లతో సమీక్షించారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎలాంటి సమస్య లేదని పూర్తి స్థాయిలో విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు వివరించారు.ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఉపాధిహామీ పనులు,తాగునీటి సరఫరాపై ఆశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ 951 కోట్ల రూ.లతో ఉపాధిహామీ,స్వచ్ఛ భారత్ మిషన్ అనుసంధానం తో వ్యక్తిగత మరుగుదొడ్లకు సోక్ పిట్ల నిర్మాణానాన్ని పెద్దఎత్తున చేపట్టడం జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా సమ్మర్ కార్యాచరణ ప్రణాళిక ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. తీవ్ర నీటిఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకులు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు వివరించారు. ఈసమావేశంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ కమీషనర్ కె.కన్నబాబు, ఆర్ డబ్ల్యుఎస్ ఇఎన్సి కృష్ణారెడ్డి,వర్చువల్ గా జిల్లా కలక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అప్పుడు ఆంధ్రాలో లేడు, ఇప్పుడు ఇండియాలోనే లేడు

● విదేశాలకు వెళ్లిన సీఎం జగన్, విపక్ష నేత చంద్రబాబు ● చంద్రబాబు ఎందుకు చెప్పకుండా వెళ్లారన్న బొత్స ● చెబితే ఏం నష్టం జరుగుతుందని ఆశ్చర్యం

అమరావతి : ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ ఇవాళ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార, విపక్ష నేతలు విదేశాల బాటపట్టడంపై స్పందించారు. చంద్రబాబు ఎక్కడికి వెళుతున్నాడో చెప్పారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎందుకు చెప్పకుండా వెళ్లారు? చెబితే వచ్చే ఇబ్బంది ఏంటి? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఫలానా ఊరు వెళుతున్నానని చెబితే నష్టం ఏముందని అన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడువుతున్న నాయకుడు ఎక్కడికైనా వెళితే ఆ విషయం చెప్పాల్సిన అవసరం ఉందని బొత్స స్పష్టం చేశారు. చెప్పాల్సిన అవసరం లేదంటే... మరి మా నాయకుడు వెళ్లినప్పుడు ఎందుకు పోస్టింగులు పెట్టాలి? ఎందుకు డిబేట్లు నిర్వహించాలి? ఇక రాడు... అక్కడే ఉంటాడు అంటూ ఎందుకు ప్రచారం చేయాలి? మా నాయకుడికి వర్తించినప్పుడు మీ నాయకుడికి కూడా వర్తించదా? మీ నాయకుడు కూడా ఇక రాడు... అక్కడే ఉండిపోతాడు అని మేం అనలేమా? అప్పుడు ఐదేళ్లు ఆంధ్రాలో లేడు... ఏం జరిగినా హైదరాబాద్ పారిపోయేవాడు... ఇప్పుడు ఇండియాలోనే లేకుండా పోయాడు అంటూ బొత్స విమర్శనాస్త్రాలు సంధించారు.

**అన్నీ తప్పుడు గణాంకాలే!**

విద్య, వైద్య రంగంలో తాము కొనసాగిస్తున్న పథకాలనే మేనిఫెస్టోలో పెట్టామని మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. మా విధానాల్లో డొల్లతనం ఉందనుకుంటే, మా విధానాల వల్ల ప్రజలు నష్టపోతున్నారనుకుంటే కూటమి ఎందుకని మరింత మెరుగైన పథకాలను మేనిఫెస్టోలో పెట్టలేకపోయిందని ప్రశ్నించారు. దానికితోడు తప్పుడు గణాంకాలు విడుదల చేస్తున్నారని, 2019లో రాష్ట్రంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? ఇప్పుడు ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? నాలుగు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు అంటూ ప్రచారం చేస్తున్నారని, అది వాస్తవ విరుద్ధం అని మంత్రి బొత్స స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి వరకు 38,61,198 మంది విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. కానీ పత్రికల్లో మాత్రం 35,69,506 మంది విద్యార్థులు ఉన్నారంటూ తప్పుడు కథనాలు వేశారని, ఇదంతా విద్యావిధానంలో లోపాల వల్లేనని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

**ప్రతి విద్యార్థిని అంతర్జాతీయ స్థాయికి సన్నద్ధం చేస్తాం**



ఏపీలో ప్రతి విద్యార్థి గ్లోబల్ స్థాయికి ఎదిగేలా నూతన విద్యావిధానం అమలు చేస్తున్నామని మంత్రి బొత్స పేర్కొన్నారు. ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్... వచ్చే ఏడాది నుంచి అమలు చేసే ఐబీ విద్యావిధానం... ఇలా అనేక విద్యా సంస్కరణలు తెచ్చామని చెప్పారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తున్నామని వెల్లడించారు. పేద విద్యార్థులకు అమ్మ ఒడి అమలు చేస్తున్నామని, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన అందిస్తున్నామని మంత్రి బొత్స వివరించారు.

## వైసీపీ అస్తవ్యస్త విధానాలతో ఐదేళ్లలో
# రాష్ట్రాన్ని నాశనం చేసింది



ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు 'ఎక్స్' (ట్విటర్) వేదికగా మరోసారి ధ్వజమెత్తారు. వైసీపీ ఐదేళ్ల పాలనపై ఆయన దుమ్మెత్తిపోశారు. అస్తవ్యస్త విధానాలతో ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారని దుయ్యబట్టారు. తమ భోగాల కోసం ఆస్తులు కూడబెట్టుకోవడానికి ఇష్టారాజ్యంగా అధికారాన్ని ఉపయోగించుకున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలపై పగ తీర్చుకోవడానికే ప్రభుత్వమన్నట్టు వ్యవహరించారన్నారు. అస్మదీయులకు భూ కేటాయింపుల కోసమే క్యాబినెట్ భేటీలు తప్పితే, ప్రజా సంక్షేమం వారికి పట్టలేదని విమర్శించారు. సచివాలయం ఊసు మరిచి తాడేపల్లి ప్యాలెస్ నుండే ఆదేశాలు, నిర్ణయాలు వెలువడ్డాయని ఆరోపించారు. దోచుకోవడం, దాచుకోవడం కోసమే వారికి అధికారం కావాలని ఫైర్ అయ్యారు. పరిపాలన ఎలా చేయకూడదో చెప్పడానికి వైఎస్ జగన్ పాలనే ఒక ప్రామాణికమని దేవినేని ఉమా అన్నారు.



## భావితరాలకు ఎనలేని సాహిత్య సంపదను అందించిన తరిగొండ వెంగమాంబ

తిరుపతి, సూర్య బ్యూరో ప్రతినిధి : తరిగొండ వెంగమాంబ తన రచనల ద్వారా భావితరాలకు ఎనలేని సాహిత్య సంపదను అందించిందని జేఈఓ శ్రీమతి గౌతమి ఉద్ఘాటించారు. శ్రీవారి అపర భక్తురాలైన భక్త కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు మంగళవారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ తరిగొండ వెంగమాంబ శ్రీవారిపై భక్తి శ్రద్ధలతో అనేక సంకీర్తనలు రచించారన్నారు. వెంగమాంబ సాహిత్యాన్ని, రచనలు, కీర్తనలను జన బాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు టీటీడీ కృషి చేస్తోందన్నారు. ముత్యాల హారతి రూపంలో శ్రీవారిలో ఐక్యమైనారన్నారు. అనంతరం జరిగిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన అనంతపురం ఎస్కె వర్సిటీ మాజీ ఉపకులపతి డా.కుసుమకుమారి మాట్లాడుతూ, వెంగమాంబ ఎన్నో రచనలు చేసినా ఆమె రచనలకు గుర్తింపు రాలేదన్నారు. టీటీడీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ఏర్పాటు చేసి ఆమె సాహిత్యాన్ని, రచనలను వెలుగులోకి తీసుకొని వచ్చిందని చెప్పారు. సంఘసంస్కర్తగా, భక్తిని ఆయుధంగా చేసుకొని ఎన్నో రచనలు చేశారని వివరించారు. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ఛైర్మన్ డా. సాయికృష్ణ యాచేంద్ర తరిగొండ వెంగమాంబ – జీవన గానం అనే అంశంపై మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలు అర్థం చేసుకునేందుకు వీలుగా జనరంజకమైన భాషలో వెంగమాంబ రచనలు చేశారని తెలిపారు. వెంగమాంబ పాటలు సామాన్య జనులు పాడుకునే విధంగా వుంటాయన్నారు. ప్రతి పాటలో భక్తి మరియు చైతన్య వంతమైన భావాలు కనిపిస్తాయన్నారు. నెల్లూరుకు చెందిన ప్రాచీన విశిష్ఠ అధ్యయన కేంద్రం డా. లోకేశ్వరి తరిగొండ వెంగమాంబ – సాహిత్యం – ప్రత్యేకత అనే అంశంపై ప్రసంగిస్తూ, వెంగమాంబ సాహిత్యంలో భక్తి అనేది ప్రత్యేకంగా కనిపింస్తుందన్నారు. మానవ జీవిత లక్ష్యం పరమాత్మ సాక్షాత్కారమని తెలిపారు. వెంగమాంబ రచనల్లో ప్రాచీన సాహిత్యం, ఆనాటి సామాజిక, భాషా, సాంస్కృతిక విశేషాలు తెలుసుకోవచ్చన్నారు.

## వారణాశిలో ఏపీ బీజేపీ
# ముఖ్య నేతల ప్రచారం

**● ప్రధానికి రికార్డు మెజార్టీనే లక్ష్యం ● తెలుగు కమ్యూనిటీతో ప్రత్యేకంగా సమావేశాలు**


**● ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి కీలక భూమిక**

వారణాశి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పోటీ చేస్తున్న వారణాశి నియోజవకర్గంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ ముఖ్య నేతలు ప్రచారం చేస్తున్నారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఈ ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారణాశి నియోజకవర్గం అంటే మినీ ఇండియా. అక్కడ అన్ని రాష్ట్రాలకు చెందిన వారు నివసిస్తూ ఉంటారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారు కొన్నివేల మంది ప్రజలు, స్థానికంగా నివాసం ఏర్పరచుకున్న భక్తులు పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అక్కడే స్థిరపడిపోయారు. వీరంతా అక్కడి ఓటర్లుగా ఉన్నారు.

వారణాశి నియోజకవర్గం ప్రధాని మోదీ పోటీ చేస్తున్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా రాజకీయంగానూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రధాని మోదీకి గత ఎన్నికల్లో అక్కడి ప్రజలు ఐదు లక్షల ఓట్ల మెజార్టీ ఇచ్చారు. ఈ సారి మరింత ఎక్కువ మెజార్టీ సాధించే అవకాశాలు ఉన్నాయి. దక్షిణాది నుంచి వారణాశిలో ఎన్నికల ప్రచారం చేసేందుకు ప్రచార బృందంలో సభ్యుడిగా ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు. మోదీ నామినేషన్ కార్యక్రమం నుంచి చురుకుగా ప్రచార బృందం వారణాశిలో పర్యటిస్తోంది. ఏపీ తెలంగాణకు చెందిన ప్రజలను విష్ణువర్ధన్ రెడ్డి కలుస్తున్నారు. తెలుగు కమ్యూనిటీతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ప్రజలతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. అందర్నీ ఓటు వేసేలా మోటివేట్ చేస్తున్నారు. వారణాశి ప్రజల్లో 70శాతం మంది బీజేపీకే ఓటు వేస్తారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు అధ్యాత్మిక కార్యక్రమాలకే ఎక్కువ పరిమితం అవుతారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపరు. ఇలాంటి వారినందర్నీ మోటివేట్ చేసి అత్యధిక పోలింగ్ నమోదయ్యేలా చూసేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. అత్యధిక పోలింగ్ నమోదైతే మోదీకి రికార్డు స్థాయి మెజార్టీ లభించే అవకాశం ఉంది. ఏపీ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో సీనియర్ నేతలంతా విస్తృతంగా ప్రచారం చేశారు. బీజేపీ



ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డికి హైకమాండ్ హెలికాప్టర్ సౌకర్యం కూడా కల్పించింది. ఏపీలో పోలింగ్ ముగిసిన తర్వాత వారణాశిలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దేశంలో సీనియర్ నేతలు ప్రచారం చేస్తున్న నియోజకవర్గాల్లో.. ఇతర ఎన్నికల సమయంలోనూ విష్ణువర్ధన్ రెడ్డికి బీజేపీ హైకమాండ్ కీలక బాధ్యతలు అప్పగిస్తూ ఉంటుంది. కర్ణాటక ఎన్నికల సమయంలోనూ ఆయన కీలక బాధ్యతలు నిర్వహించారు.



# ఉత్తరాంధ్రకు రెండోసారి సీఎస్

**● సీక్రెట్‌గా టూర్.. ఏం జరుగుతోంది..? ● వేసవి తాగునీరు సమస్యను పక్కనబెట్టిన వైనం ● ఎయిర్‌పోర్టు నిర్మాణాల పనులపై ఆదరాబాదరగా సమీక్ష**

విశాఖపట్నం : ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి సీక్రెట్‌గా పర్యటించడంపై రకరకాల అనుమానాలు మొదలయ్యాయి. సోమవారం అకస్మాత్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాల పనులను పరిశీలించారు. ఇదే అంశం ఏపీ వ్యాప్తంగా చర్చ మొదలైంది. ఇంతకీ సీఎస్ పర్యటన వెనుక ఏం జరుగుతోంది? ఇలా రకరకాల ప్రశ్నలు వెంటాడుతున్నాయి. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సోమవారం విజయనగరం జిల్లాకు వెళ్లారు. అక్కడ భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను పరిశీలించారు. ముఖ్యంగా టెర్మినల్ భవనంతోపాటు రన్ వే, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ భవనాల పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత చిన్నపాటి సమీక్ష చేయడం, అనుకున్న సమయానికి పూర్తి కావాలని కాంట్రాక్ట్ సంస్థకు ఆదేశించారు.

నిర్మాణాల పనులను జీఎంఆర్ సంస్థ చూస్తోంది. ఇదిలావుండగా నిర్మాణాల పనులు సక్రమంగా జరగలేదని ఫిర్యాదుల నేపథ్యంలో సీఎం జవహర్‌రెడ్డి విజిట్ చేశారన్నది అధికారుల నుంచి బలంగా వినిపిస్తున్నమాట. సీఎస్ వస్తున్న విషయాన్ని అధికారులు గోప్యంగా ఉండడంపై ఏం జరుగుతోందన్న చర్చ రాజకీయ నేతల్లో మొదలైంది. అసలే వేసవికాలం తాగునీరు సమస్యను పక్కనబెట్టి ఎయిర్‌పోర్టు నిర్మాణాల పనులకు సీఎస్ రావడంపై రకరకాలుగా చర్చించుకుంటున్నారు. అకాల వర్షాలు చాలా జిల్లాలను ఇబ్బందిపెట్టాయి. దీనికితోడు ఈసారి రుతుపవనాలు ముందుగా వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఎన్నికల ఫలితాలకు సమయం ఉండడంతో వాటిపై దృష్టి పెట్టాల్సిన సీఎస్, భోగావురం పనులపై ప్రత్యేకంగా రావడమేంటని అంటున్నారు. గతంలో కూడా ఆయన ఓసారి విశాఖపట్నం వచ్చారు. ఈ విషయం కూడా ఎవరికీ తెలీకుండా సీక్రెట్‌గా వచ్చారు. ఇప్పుడు భోగావురం వంతైంది. సీఎస్ వ్యవహారశైలిని గమనించిన వాళ్లు మాత్రం వెనుక ఏదో జరుగుతుందని అంటున్నారు.

# పల్నాడులో చాలా మంది పారిపోయారు

**● మగవాళ్లు ఊరొదిలి ఎందుకు వెళ్లారని పోలీసుల ఆరా ● గుడిలో దాక్కునే పరిస్థితులలో ఆడవారు ● నేటికీ ఉద్రిక్తంగానే జిల్లాలలో పరిస్థితులు**

**● ఎలక్షన్ తర్వాత హింస చెలరేగడం ఆందోళన కలిగించేదే**

పల్నాడు... పల్నాడులో పోలింగ్ అనంతరం జరిగిన దాడులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగించాయి. మూక దాడులు, వాహనాల దహనం, రాళ్ళ దాడులు నుంచి పెట్రోల్ బాంబు దాడులతో దద్దరిల్లింది పల్నాడు. ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా, ఆటవిక పాలనలో కొనసాగుతున్నామా అన్న సంశయము కలిగించింది. ఈ ప్రతీకార దాడులు చూస్తుంటే పార్టీ నాయకులు ఫ్యాక్షన్ లీడర్లుగా మారారన్న భావన కలగక మానదు.

**ఈసారి హింసాత్మక ఘటనలు**

పల్నాడు ప్రాంతంలో పోలింగ్ రోజు ఉద్రిక్తంగా ఉండటం సహజం. కానీ ఈ సారి ఈ ప్రాంతంలో ఎలక్షన్ తర్వాత హింస చెలరేగడం ఆందోళన కలిగిస్తోంది. పోలింగ్ జరుగుతున్న సమయంలో బూత్ ల పరిశీలనకు వచ్చిన నర్సారావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలతో ప్రారంభమైన దాడి యత్నాలు ఆ తర్వాత మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నేల్లి రామకృష్ణా రెడ్డి, ప్రత్యర్థి టీడీపీ అబ్యర్థి జూలకంటి బ్రహ్మ రెడ్డి వరకు కొనసాగింది. సత్తెనపల్లి లో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ... వైసీపీ అభ్యర్థి మంత్రి అంబటి రాంబాబు ఎదురు పడిన సందర్భంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నర్సారావుపేట టీడీపీ అభ్యర్థి డా.అరవింద బాబు మునిసిపల్ హైస్కూల్ లో టింగ్ సరళి పరిశీలించేందుకు వెళ్ళిన సదర్భంలో వైసీపీ శ్రేణులు దాడి చేశారు. అప్పటికి పోలింగ్ సమయం పూర్తి కావడంతో ఇక గొడవలు ఉండవని భావించారు. అయితే అంచనాలు తలకిందులు చేస్తూ ఒక్క సారిగా హింస చెలరేగింది.

**ఊరొదిలివెళ్లిన మగవాళ్లు**

పోలింగ్ సమయం ముగిసిన తర్వాత తంగిడి గ్రామంలో పెట్రోల్ బాబుల దాడితో ఉద్రిక్తతలు తలెత్తాయి. డా. అరవింద్ దాడికి ప్రతిగా వైసీపీ అబ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఇంటిపై దాడికి దిగారు వైసీపీ కార్యకర్తలు. పోలీసులు కంట్రోల్ చేయలేక చివరకి రబ్బరు బుల్లెట్లు ఉపయోగించారు. తర్వాత టీడీపీ వాహనాలను తగల బెట్టారు వైసీపీ నాయకులు. పారామిలిటరీ దళాలను రంగంలోకి దించవలసి వచ్చింది. కొత్త గణేషుంపాడులో వైసీపీకి ఓటు వేశారని దాడి చేయడంతో మగవాళ్ళు ఊరు వదిలి వెళ్ళారు.

మహిళలు ఆ రాత్ర గుడిలో తలదాచుకున్నారు. ఈ ఘటన తెలిసి గురజాల ఎంఎల్ఏ కాసు మహేష్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్ పరామర్శకు వెళితే గ్రామస్తులు దాడికి దిగడంతో పోలీసులు అతి కష్టంగా ఇద్దరిని సేవ్ చేసి అక్కడ నుంచి పంపించి ఊపిరి పీల్చుకున్నార్. ఇక అదే రోజు కారంపూడి లో విచక్షణారహితంగా వైసీపీ చేసిన దాడిలో వాహనాలు దహనమయ్యాయి. గ్రామంలో కనిపించిన వారిపై దాడి చేయడంలో బెంబేలెత్తిపోయారు ప్రజలు. దాడి చేయడానికి వచ్చిన వారు మారణాయుధాలతో తిరగుతున్న దృశ్యాలు సోషల్ మీడియా లో హల్ చల్ చేశాయి.

**ఆ 4 నియోజకవర్గాలు పల్నాడులోనే..**

ఈ విధంగా హింసాత్మక సంఘటనలు జరగడానికి కారణం ఏమిటి అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ఒక పక్క రాష్ట్రంలో సమస్యాత్మామైన నియోజకవర్గాలు 11 ఉండగా అందులో 4 నియోజకవర్గాలు పల్నాడులో ఉన్నాయి. అవి మాచర్ల, గురజాల, నర్సారావుపేట, పెదకూరపాడు.. సమస్యాత్మక ప్రాంతాలకు కేంద్రం పారామిలిటరీ బలగాలను పంపింది. పల్నాడు ప్రాంతానికి కూడా అదనపు బలగాలు చేరుకున్నాయి. అయితే హింసాత్మక కార్యక్రమాలు యథేచ్ఛగా జరిగాయి. కేంద్ర బలగాలు పరిస్థితులను కంట్రోల్ చేయలేక పోయాయి.

కేంద్ర బలగాలకు సపోర్టుగా తగినంత పోలీస్ సిబ్బంది లేకపోవడం కారణంగా చెబుతున్నారు. పోలింగ్ స్టేషన్లలో తగినంత భద్రతా సిబ్బంది లేకపోవడం.. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలోనూ ఒకరిద్దరే పోలీసులు ఉండటంతో పార్టీలో ఉన్న ఆల్లరి మూకలు రెచ్చి పోయారు. గత 20 ఏళ్ళలో కనివిని ఎరుగని హింస చెలరేగింది. వివాదం మొదలైన సదర్భంలోనే దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన పోలీస్ అధికారులు నిర్లిప్తత వహించారనే ఆరోపణలు ఉన్నాయి. గొడవలు నివారించేదుకు యాక్షన్ లోకి దిగితే నాయకుల ఆగ్రహానికిలోను కావలసి వస్తుందని పోలీస్ అధికారులు భావించారని ఒక వాదన.



అధికారంలోకి వచ్చిన తర్వాత తమపై కక్ష సాదింపు చర్యలకు పూనుకుంటారేమో అన్న భయం వారిని వెంటాడిదన్న టాక్ నడుస్తోంది.


ఇక నాయకుల తీరు ఏదోవిధంగా గెలవాలి అన్న దోరణిలో ఉంది...బలప్రయోగం, భయపెట్టి, రిగ్గింగు చేసి అయిన విజయం సాధించాలి అన్న పట్టుదల కనిపించింది....ఇక్కడ ప్రజా సేవ చేయ్యాలన్న ప్రేమ నాయకులలో లేదు...కేవలం ప్రకృతి ఒనరులను దోచేందుకే అధికారం.ఆ పార్టీ లేదు ఈ పార్టీ లేదు అక్రమ మైనింగ్, లిక్కర్ మాఫియా, సాండ్ మాఫియా,సున్నవురాయి వ్యాపారుల నుంచి భారీ వసూళ్ళు, ల్యాండ్ మాఫియా తెలంగాణ బోర్డర్ పక్కనే ఉండటంతో ఏపీలో వివిధ ప్రాంతాల నుంచి వెళ్ళే గ్రానైట్ లారీకి ఇంతని వసూలు ఇవ్వకపోతే కేసులు పెట్టించి బండిని సీజ్ చేయించడం అందిన కాడికి దోచు కోవడం కోసమే ఇక్కడి అధికాకం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి మారీ గెలువు కోసం దాడులకు, హింసాత్మక కార్యక్రమాలకు వెనకాడరు..

**ప్రతిసారి అగ్ని పరీక్షే**

ఎప్పుడూ పల్నాడులో పోలింగ్ అంటే అధికారులకు అగ్నిపరీక్షే. కానీ ఈ సారి పోలింగ్ తర్వాత జరిగిన సంఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. పల్నాడు ఎస్పీ బిందు మాధవ్ ను సస్పెండ్ చేసింది. కలెక్టర్ శివశంకర్ ను మార్చింది. పల్నాడు ప్రాంతంలో జరిగిన హింసాత్మక ఘటనలపై సిట్ దర్యాప్తునకు ఆదేశించింది సీఈసీ. దర్యాప్తులో శాంతి భద్రతలు అదుపు తప్పడానికి కారణాలు ఏమిటి అన్న అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది

## అనంత జిల్లాలో ఎన్ఐఏ సోదాలు

**● ఉగ్రవాదులతో లింక్స్‌పై ఆరా ● ఓ రిటైర్డ్ హెచ్ఎం ఇంట్లో అధికారులు తనిఖీలు**




అనంతవురం... అనంతవురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని ఆత్మకూర్ వీధికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఇంట్లో ఎన్ఐఏ అధికారులు మంగళవారం ఉదయం సోదాలు చేశారు. కొందరు యువకులకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ ఇంట్లో సోదాలు చేసిన అధికారులు.. ఆయన కుమారుల గురించి ప్రశ్నించినట్లు సమాచారం. అబ్దుల్ కుమారులు కొంతకాలంగా బెంగుళూరులో నివసిస్తున్నారు. అయితే, వారు అకస్మాత్తుగా కనిపించకుండా పోయారు. వారికి ఉగ్రవాదులతో లింక్స్ ఉన్నాయని ఆరోపణలు రావడంతో కుటుంబ సభ్యులను ప్రశ్నిస్తున్నారు. అబ్దుల్ కుమారుడి ఎస్బీఐ అకౌంట్ కు ఇటీవల అధిక మొత్తంలో నగదు జమ అయ్యినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై కూడా ఆరా తీస్తున్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# సీఎస్‌తో డీజీపీ భేటీ

**● సిట్ నివేదికపై ఈసీ ఆదేశాలు వస్తే ఏం చేద్దాం? ● ఎన్నికల అనంతరం జరిగిన హింసపై సిట్ నివేదిక ● కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన సీఎస్ జవహర్‌రెడ్డి**

అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల రోజు, అనంతరం జరిగిన హింసపై సిట్ నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన నేపథ్యంలో సీఎస్ జవహర్‌రెడ్డితో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా భేటీ అయ్యారు. మంగళవారం సచివాలయంలో ఇద్దరు ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. సిట్ ప్రాథమిక నివేదికపై ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వస్తే తీసుకోవాల్సి చర్యలపై ఇరువురు చర్చించినట్టు సమాచారం.

ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఏర్పాటైన సిట్ దర్యాప్తులో పోలీసుల వైఫల్యాలు వెలుగుచూశాయి. పల్నాడు, తిరుపతి, అనంతవురం జిల్లాల్లో రెండు రోజులుగా విస్తృతంగా పర్యటించిన సిట్ బృందాలు 6 నియోజకవర్గాల పరిధిలో తీవ్ర హింసాత్మక ఘటనలకు సంబంధించి నమోదైన 33 కేసులను పరిశీలించాయి. వీటికి సంబంధించిన 150 పేజీల సమగ్ర నివేదికను సిట్ అధిపతి వినీత్ బ్రిజ్‌లాల్, ఎస్పీ రమాదేవి సోమవారం సాయంత్రం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు అందజేశారు. ఆయన ఈ నివేదికను ఎన్నికల సంఘానికి పంపించిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో సిట్ నివేదిక కలకలం రేవుతోంది. ఈసీ నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయోనని పోలీసుశాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది.



## వైసీపీ నేతల్లో ఓటమి భయం



అమరావతి, సూర్య బ్యూరో ప్రతినిధి : ఏపీలో తాజా పరిణామాలపై టీడీపీ సీనియర్ నేత బొండా ఉమ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓడిపోతున్నామన్న విషయం జగన్ కు అర్థమైందని, అందుకే ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ఓటమి తప్పదన్న విషయాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే తామే గెలుస్తామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఓటమి భయంతో వైసీపీ నేతలు కుదేలవుతున్నారని, అందుకే జగన్ చిన్నపాటి ఓదార్పు యాత్ర చేపట్టి ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లారని వ్యంగ్యం ప్రదర్శించారు. ఎన్నికల్లో గెలువుపై ధీమా వ్యక్తం చేస్తున్న జగన్... ఎన్నికల్లో ఓడిపోతే పార్టీని మూసేస్తామని చెప్పగలరా? అని బొండా ఉమ సవాల్ విసిరారు.ఇక, ఏపీలో పోలింగ్ నేపథ్యంలో జరిగిన హింసపై సిట్ తన నివేదికను డీజీపీకి అందించడంపైనా ఉమ స్పందించారు. సిట్ అందించిన నివేదికను డీజీపీ బహిర్గతం చేయాలని అన్నారు. టీడీపీ నేతలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పెద్దిరెడ్డి, పిన్నెల్లి బ్రదర్స్, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి, గోపిరెడ్డిలపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వైసీపీ నేతల ఇళ్లలో బాంబులు, వేట కొడవళ్లు దొరికినా కేసులు నమోదు చేయడంలేదని బొండా ఉమ మండిపడ్డారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి కోసం చట్టాన్ని అతిక్రమిస్తే జైలుపాలవుతారన్న విషయాన్ని అధికారులు గుర్తించాలని హితవు పలికారు. పల్నాడు, అనంతవురం ఎస్పీలకు ఎలాంటి పర్యవసానాలు ఎదురయ్యాయో ఇతర అధికారులు గమనించాలని అన్నారు. ఇప్పటివరకు జరిగిన ఘటనల నేపథ్యంలో, సస్పెండ్ అయిన అధికారుల కాల్ డేటాను బయటికి తీయాలని, అరాచకాలకు కారకులైన నేతల కాల్ డేటాను కూడా బయటికి తీయాలని బొండా ఉమ స్పష్టం చేశారు.

## స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద
# మూడంచెల బందోబస్తు



అమరావతి, సూర్య బ్యూరో ప్రతినిధి : ఎన్నికలు అనంతరం ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద మూడంచెల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ పీహెచ్డీ రామకృష్ణ వెల్లడించారు. నగరంలోని కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం హింస ఎక్కడా చెలరేగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫలితాలు వచ్చిన తర్వాత కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్ర త్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువగా ఘర్షణలు జరిగాయన్నారు. ఓట్ల లెక్కింపు పారదర్శక, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. శాంతి, భద్రతలపరంగా సమస్యలు సృష్టించిన 109 మందిని గుర్తించామనీ, త్వరలో వారిని బైండోవర్ చేస్తామని వివరించారు. పది మందిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. ఏడుగురిని నగర బహిష్కరణ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈవీఎంలు భద్రపర్చిన నిమ్రా, నోవా కళాశాలల్లో స్ట్రాంగ్ రూమ్లను ఏర్పాటు చేశామని వాటికి మూడంచెల భద్రత కల్పించామన్నారు. స్ట్రాంగ్ రూమ్ల పరిసర ప్రాంతాలను నో ఫ్లయింగ్ జోన్గా ప్రకటించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్స్ ఏరియా నుండి రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్ అమల్లో ఉంటుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం ఉన్న వ్యక్తులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు, ఏజెంట్లకు మాత్రమే స్ట్రాంగ్ రూమ్లను పరిశీలించేందుకు అనుమతి ఉందన్నారు. స్ట్రాంగ్ రూంలోకి వెళ్లేముందు, తిరిగి వచ్చేముందు వివరాలను లాగ్ బుక్లో రాయాల్సి ఉంటుందన్నారు. 29 స్ట్రాంగ్ రూంలను అనుసంధానం చేస్తూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందిని అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం జరిగిన సంఘటలను దృష్టిలో పెట్టుకొని అన్ని డివిజన్లలో పికెట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సెక్షన్ 144తో పాటు పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉండడంతో కమిషనరేట్ పరిధిలో పోలీసులు అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నా కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. వదంతులు నమ్మి ఎవరూ గొడవలకు పాల్పడవద్దని సూచించారు. ఏవైనా అనుమానాలుంటే పోలీసులను సంప్రదించి రూఢి చేసుకోవాలని సీపీ రామకృష్ణ స్పష్టం చేశారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మొద్దన్నారు. పెట్రోల్ బంకుల్లో డబ్బాలు, క్యాన్లలో పెట్రోల్ అమ్మకాలపై నిషేధం ఉందన్నారు. బాణాసంచా అమ్మడం, కాల్చడం.. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్టేనని వాటి తయారీ, విక్రయదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా విష ప్రచారం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాన్ని మరింత విస్తరించామన్నారు. కీలకమైన ప్రాంతాల్లో స్టేషన్ల వారీగా కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. తద్వారా ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు పక్కా నిఘా ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని సీపీ రామకృష్ణ వివరించారు.

## మే 23 నుండి పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : పాలిసెట్ 2024 అడ్మిషన్ల ప్రక్రియ మే 23వ తేదీ గురువారం నుండి ప్రారంభం అవుతుందని సాంకేతిక విద్యా శాఖ కమీషనర్, సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఛైర్మన్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ను బుధవారం విడుదల చేయటం జరుగుతుందన్నారు. అమరావతి లోని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కార్యాలయంలో మంగళవారం పాలిసెట్ ప్రవేశాలకు సంబంధించి విద్యా విషయక సమావేశం నిర్వహించారు. ప్రవేశాలకు సంబంధించిన విభిన్న అంశాలను చర్చించిన సమావేశం సంబంధిత ప్రక్రియకు అవసరమైన ప్రణాళికను ఖరారు చేసింది. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ ప్రవేశాలకు సంబంధించిన ఫీజు చెల్లింపు తదితర ఆన్ లైన్ ప్రక్రియకు మే 24వ తేదీ నుండి జూన్ 2వ తేదీ వరకు పది రోజుల పాటు అవకాశం ఉంటుందన్నారు. ధృవపత్రాల వెరిఫికేషన్ కు మే 27 నుండి జూన్ 3వ తేదీ వరకు ఎనిమిది రోజుల లోవు పూర్తి చేయవలసి ఉందన్నారు. ఐచ్ఛికాల నమోదుకు మే 31వ తదీ నుండి జూన్ 5వ తేదీ వరకు అవకాశం కల్పించామన్నారు. జూన్ 5వ తేదీన ఐచ్ఛికాల మార్పుకు అవకాశం ఉంటుందని , జూన్ 7వ తేదీన సీట్ల కేటాయింవును పూర్తి చేస్తామని కమీషనర్ వివరించారు. జూన్ పదవతేదీ నుండి 14వ తేదీ వరకు 5 రోజుల లోవు ప్రవేశాలు ఖరారు అయిన విద్యార్థులు అయా పాలిటెక్నిక్ లలో వ్యక్తిగతంగా, ఆన్ లైన్ విధానంలోనూ రిపోర్టు చేయవలసి ఉంటుందన్నారు. జూన్ 10వ తేదీ నుండే రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు ప్రారంభం అవుతాయని నాగరాణి పేర్కొన్నారు. ర్యాంకు కార్డులను వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చని, ప్రవేశాల కౌన్సిలింగ్ కు సిద్దంగా ఉండాలన్నారు. పాలిసెట్ పరీక్షకు మొత్తం 1,42,035 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకాగా, 87.61 శాతం మేర 1,24,430 మంది అర్హత పొందారు. బాలికలు 56,464 మంది పరీక్షకు హాజరుకాగా, 89.81 శాతం మంది, బాలురలో 85,561 మంది హాజరుకాగా 86.16 శాతం అర్హత గడించారు.

## సోమాలమ్మకు ప్రత్యేక పూజలు



అమరావతి బ్యూరో, ప్రతినిధి: కోరిన కోర్కెలు తీర్చే దేవత సోమాలమ్మ అమ్మవారు అని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) అన్నారు. పాలకోడేరు రాజ్ కాలవ గట్టు ప్రాంతం లో స్వయంభుగా వెలసిన సోమలమ్మ అమ్మవారి 35వ జాతర మహోత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు మాట్లాడుతూ సోమలమ్మ అమ్మవారు కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల పాలిట కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్నారని తెలిపారు. ఈరోజు జాతర మహోత్సవంలో భాగంగా కమిటీ సభ్యులు అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేశారు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తాను ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినవుడు అమ్మవారిని దర్శించుకుని నాకు విజయాన్ని చేకూర్చమని అమ్మవారిని వేడుకున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మామిడిశెట్టి మూర్తి నందన, గొట్టుముక్కల రామచంద్రరాజు, గుత్తుల సాయిబాబు, మన్నె మహంకాళి, గులుపల్లి సత్యనారాయణ, బురిడీ రవిబాబు, చనంశెట్టి బాబి, పరిమి కాశి, దవిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూమిపై జీవాల మధ్య భేదాన్నే 'జీవవైవిధ్యం' అంటాం. సృష్టిలో గల జీవరాశులలో ఏ ఒక్కటి అధికం కాదు, ఏదీ తక్కువ కాదు. అన్ని సమానమే. అన్ని ఒకదాని మీద ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి. మనిషి తన ప్రతి అవసరానికి ప్రకృతి మీద ఆధార పడతాడు. ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు. ఇది గమనించిన భారతీయ ఋషులు జీవ వైవిధ్య చక్రం సక్రమంగా సాగేలా, మనిషి వాటిలో కల్పించుకుని వీలు లేకుండా మానవ ధర్మాలను వివరించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంను మే 22 న జరుపు కుంటారు. 2010ని అంతర్జాతీయ జీవ వైవిధ్య సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. నాటినుండి ఏటా ఆ దినాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. నేడు భూమిపై ఉన్న అనేక మిలియన్ల వివిధ జాతుల జీవ వైవిధ్యం సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల పరిణామం. మన జీవన శైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుంది. దీంతో జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. వివిధ

## ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు

కారణాల వల్ల ఎన్నో జీవ జాతులు అంతరించి పోతున్నాయి. ప్రపంచంలోని 12 మహా జీవ వైవిధ్య ప్రాంతాలలో భారత దేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు ఈ దేశంలో గతంలో ఉండేవి. కారణాంతరాల వల్ల అనేక జీవులు కనుమరుగు అవుతున్నాయి. నేడు జీవ సంపదలో 10 శాతానికిపైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించి పోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికి పైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు మృగ్యమై పోయాయి. విస్తారంగా ఉన్న పచ్చిక బయళ్ళను స్వార్థ ప్రయోజనాల కోసం రూపు మాపడం జరిగింది. అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి మరీ అంతమొందించడం నిత్య కృత్యం అవుతున్నది. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీలు లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణ రహితంగా వాడేలా చేస్తున్నది. దీంతో నేలను, దానిపై నివసించే విలువైన జీవ సంపదను కోల్పోవాల్సి వస్తున్నది. అత్యధిక కీటక నాశనులను ఉత్పత్తి చేసే దేశంగా భారత్ విరాజిల్లుతోంది. ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్టపోతున్నాం. అంతే కాదు ఎన్నో జీవ జాతులు కాల క్రమంలో అంతరించి పోయాయి. భారత దేశంలో ఆదివాసులు (గిరిజనులు, కొండజాతి ప్రజలు) అధికంగా ఉన్నచోట జీవ వైవిధ్యం ఎక్కువగాను, పదిలంగాను ఉంది. మన దేశంలో 53 మిలియన్ల కంటే ఎక్కువ మందే ఆదివాసులు నివసిస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి. వారిలో దాదాపు 53 తెగలున్నాయి. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్లో 80 శాతాని కంటే ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారు. అక్కడే జన్యు వైవిధ్యం కూడా ఎక్కువగా ఉంది. ఎన్నో పంటలలో వైవిధ్యాలు, రకాలు, ఆదివాసులు నివాసాలున్న ప్రాంతాలలోనే అధికం. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తోంది. వీటిని రూపొందించే, ప్రవేశపెట్టే విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలి. జన్యు మార్పిడి వల్ల వచ్చే ప్రభావాలు స్వల్ప కాలంలో, దీర్ఘకాలంలో ఎలా ఉంటాయో పూర్తి అధ్యయనం చేయకుండా వీటిని ఏ జీవ జాతుల్లోనూ ప్రవేశ పెట్టకూడదు. తొందర పడితే ప్రస్తుతం మనుగడ లోని జీవజాతికే ప్రమాదం వాటిల్లు తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ సృష్టిలో అన్నిటిలో ఏకత్వం ఎంత ఉందో, భౌతికంగా, మానసికంగా భిన్నత్వం కూడా అంతే ఉంది. వైవిధ్యమే సృష్టి లక్షణం అంటారు స్వామి వివేకానంద. వ్యవసాయ పద్ధతులే కావచ్చు, జీవన విధానమే కావచ్చు, ఆహారపు అలవాట్లే కావచ్చు, అన్ని సృష్టి చక్రానికి లోబడే ఉంటాయి. చెరువులో ఉండే కీటకాలను తిని కప్ప జీవిస్తుంది. కప్పను తిని పాము జీవిస్తుంది, పామును గద్ద తింటుంది, గద్ద మరణించాక దాన్ని క్రిములు తిని భూమిలో కలిపేస్తాయి. అది మొక్కలకు ఎరువుగా మారుతుంది. ఇదంతా ఒక గొలుసుకట్టు విధానం, ఒక నిరంతర ఆవృత వృత్తం. వీటిలో ఏ ఒక్క ప్రాణి అంతరించినా మిగితా అన్నిటి మీద ప్రత్యక్షంగా తీవ్ర ప్రభావం ఉంటుంది, మిగతా ప్రాణుల మీద పరోక్షంగా ముప్పు ఉంటుంది. ఇలా జగత్తులో అనేక వృత్తాలు ఉంటాయి. వాటిలో మనిషి ఏ మాత్రం జోక్యం చేసుకున్నా అది వినాశనానికి దారి తీస్తుంది, ఏ ఒక్క జీవి అంతరించినా, మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అనారోగ్యాలకు చికిత్స, వైద్యం చేయడానికి జీవవైవిధ్యం చాలా ముఖ్యం. అనేక మొక్కలు, జంతువులు, శిలీంధ్రాలను మందుల తయారీకి వాడడం చూస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఏటా వేలాది జాతుల జీవరాశులు అంతరించి పోతున్నాయి. వాతావరణ సమ తుల్యానికి, పర్యావరణ పరిరక్షణకు జీవరాసులను కాపాడు కోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇందుకోసం చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమైంది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# శాంతి కపోతం రెక్కలు విరుస్తున్న ఉగ్రవాద కోరలు

- ఉగ్రవాదంతో మానవ వినాశనం, ఆస్తి నష్టం, సమాజ విచ్ఛిన్నం ● అశాంతి పెట్రేగి విశ్వ మానవాళిని పట్టి పీడిస్తున్న ఉగ్రవాదం భూతం
- అమాయకుల మరణాలు, క్షతగాత్రుల హాహాకారాలు, పలు దేశాలలో ఆందోళనలు ● మన దేశ ప్రధానమంత్రినే పొట్టన పెట్టుకున్న తీవ్రవాదం
- యావత్ ప్రపంచానికే పెను సవాలు విసురుతున్న ఉగ్రవాదులు

డా : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాద ఉచ్చులో అతలాకుతలం అవుతున్నాయి. మానవ వినాశనం, ఆస్తి నష్టం, సమాజ విచ్ఛిన్నం, దేశాభివృద్ధికి విఘాతం, అశాంతి పేట్రేగిపోవడం లాంటి దుష్ప్రభావాలతో ఉగ్రవాదం భూతం విశ్వ మానవాళిని పట్టి పీడిస్తున్నది. ఉగ్రవాదానికి పర్యాయపదంగా హింసాత్మక ఘటనలు నిలుస్తున్నాయి. ఏ పేపరు చదివినా, ఏ టీవీ చానెల్ చూసినా ప్రపంచంలో ఏదో ఒక మూలన భయానక ఉగ్రవాద హింసాత్మక ఘటనలు కనిపిస్తున్నాయి. మానవాళిని భయకంపితులను చేయడం, సమాజంలో హింసకు ఊతం ఇవ్వడం, రక్షక బలగాలతో నేరుగా సాయుధ పోరుకు సిద్ధం కావడం, అమాయకుల మరణాలు, క్షతగాత్రుల హాహాకారాలు, దేశాల విచ్ఛిన్నాన్ని చవిచూడడమే ఉగ్రవాదుల దుశ్చర్యగా తోస్తున్నది. దీనికి తోడుగా దేశ సరిహద్దులను దాటుతూ అక్రమంగా చొరబడడం, ఆయుధాల అక్రమ రవాణ, అమాయక ప్రజలను కాల్చి వేయడం, దేశాన్ని అస్థిర పరిచే ఆకృత్యాలకు పాల్పడడం, ప్రపంచ శాంతికి విఘాతం కలిగించడం, జాతి ఏకత - మత సామరస్యం - మానవీయతను వ్యతిరేకించడం, అంతర్గత కలహాలు సృష్టించడం లాంటి దేశ వ్యతిరేక లక్ష్యాలతో ఉగ్రవాదులు పని చేస్తున్నారు. ఉగ్రవాద వ్యతిరేక అంశాల పట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో చైతన్యంతో కూడిన అవగాహన కల్పించడం, సంఘవ్యతిరేక శక్తుల కట్టడి, ఉగ్రవాదం మిగిల్చే నష్టాలను, దేశద్రోహ చర్యలను తెలియజేయడం లాంటి అంశాలను దేశ ప్రజలకు వివరించడానికి ప్రతి ఏటా 21 మే రోజున 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం' పాటించుట జరుగుతున్నది. తమిళనాడు, శ్రీ పెరంబుదూరులో 21 మే 1991న దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని యల్టీటీఈ ఉగ్రవాదులు ధాను అనే మహిళ మానవ బాంబుగా మారి హత్య చేయడం జరిగింది. ధానుతో పాటు 14 మంది మరణించిన ఈ ఉగ్రదాడిలో పాల్గొన్న పేరరివాళన్, శాంతన్, నళిని, మురుగన్లను దోషులుగా నిర్ణయించి సుప్రీంకోర్టు మరణశిక్ష ఖరారు చేసిన తరువాత వీరిలో ముగ్గురి శిక్షను జీవితఖైదుగా మార్చింది. రాజీవ్గాంధీ హత్యకేసులో 30 ఏళ్లు జైలుశిక్ష అనుభవిస్తున్న పేరరివాళన్ను విడుదల చేయాలని తాజాగా సుప్రీమ్ కోర్టు ఆదేశించిన విషయం మనకు తెలుసు. ఈ దుశ్చర్యకు వ్యతిరేకంగా రాజీవ్గాంధీ వర్ధంతి సందర్భంగా 21 మే రోజున "జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం" నిర్వహించుట జరుగుతున్నది. ఉగ్రవాదం మానవజాతికి మాత్రమే కాదు ప్రపంచ మానవీయతకే సవాళుగా నిలుస్తున్నది. జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం వేదికగా యువత సమక్షంలో 'అంటీ-టెర్రరిజమ్ ప్రతిజ్ఞ'ను కూడా చేయించడం జరుగుతుంది. భారతదేశంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు అనునిత్యం సరిహద్దుల్లో చొరబడడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నకిలీ కరెన్సీ పంపిణి, ఆయుధాల అక్రమ రవాణా లాంటి పలు దేశ వ్యతిరేక చేష్టలు చేస్తూనేన్నారు. ఉగ్రవాదం అధికంగా ఉన్న దేశాల్లో అఫ్ఘానిస్థాన్, ఇరాక్, పాకిస్థాన్, నైజీరియా, సిరియా, యెమన్, సొమాలియా తరువాత ఇండియా ఉందని గమనించాలి. 1993లో బాంబే అల్లర్లలో 260 మంది అమాయ ప్రజల మరణించడంతో పాటుగా 700 మంది గాయపడడం అత్యంత హేయమైన ఉగ్రవాద చర్యగా చరిత్రలో నిలుస్తున్నది. 2001 డిసెంబర్ 13న ఐదుగురు లష్కరే-తోయిబా ఉగ్రవాదులు పార్లమెంట్లోకి చొరబడి జరిపిన కాల్పుల్లో 9 మంది పోలీసులు/సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. 11 జూలై 2006న ముంబాయ్ రైళ్లలో 11 నిమిషాల్లోనే ఏడు బాంబులు పేల్చగా, 209 మంది ప్రాణాలర్పించడం, 700 మందికి పైగా గాయపడడం జరిగింది. 26 నవంబర్ 2008న ముంబాయ్లో పాకిస్థానీ లష్కరే తోయిబా ఉగ్రవాదులు జరిపిన కాల్పులు, బాంబు విస్పోటనాలలో 174 మంది మరణించగా 300లకు పైగా క్షతగాత్రులు గాయపడ్డారు. 14 ఫిబ్రవరి 2019న పుల్వామా దుర్ఘటనలో 40 మంది సిఆర్పియఫ్ బలగాలు తుది శ్వాస విడిచాయి. ఈ దుర్ఘటనకు ప్రతిచర్యగా భారతీయ వాయు సేన పాకిస్థాన్లోకి చొరబడి ఉగ్రవాద స్థావరాలను నేల మట్టం చేసి, ధీటైన సమాధానం అవ్వడం కూడా జరిగింది. ఇండియాలో ఇస్లామిక్ టెర్రరిజమ్, సెపరేటిస్ట్ టెర్రరిజమ్, లెఫ్ట్ వింగ్ టెర్రరిజమ్ అనే 3 వర్గాలు ఉన్నాయి. భారత దేశంలో 1970 - 2017 మధ్య కాలంలో పలు ఘటనల్లో జరిగిన 12,002 ఉగ్రవాదుల దాడులలో, 19,866 మంది మరణించగా, 30,544 మంది గాయపడడం జరిగిందనే వాస్తవాన్ని భారతీయులు తెలుసుకోవాలి.

**ఉగ్రవాదానికి పలు కారణాలు:**

ఉగ్రవాద వ్యతిరేక దినం సందర్భంగా శాంతి, మానవీయతల పట్ల అవగాహనా౦దేశం వ్వడంతో పాటు ప్రజల్లో దేశభక్తి పెంపొందించడం, జాతీయ ఐక్యత, యువతలో ఉగ్రవాద వ్యతిరేక శిక్షణలు ఇవ్వడం, ఉగ్రవాద దుష్పరిణామాల వివరణ లాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. ఉగ్రవాదానికి కులమతాలు లేవు. అవి రక్తపాతానికి మాత్రమే దారి తీస్తాయి. ఒకరు కాని సమూహం కాని పరాయి దేశం లేదా ప్రభుత్వానికి/దేశానికి వ్యతిరేకంగా జరిపే దాడిలో హత్యలు, హింస, దాడులు, దొంగతనాలు, రేపులు, కిడ్నాపులు, భీకర పోరాటాలు, బాంబులు వేయడం లాంటి పలు దేశద్రోహ చర్యలకు పాల్పడతారు.



శిక్షితులైన ఉగ్రవాదులను గుర్తించి పట్టుకోవడం చాలా కష్టంతో కూడుకొని ఉంటుంది. ఉగ్రవాదం ఓ మహత్తర దైవ కార్యమనే భావనలో ఉగ్రవాదులు ఆత్మ బలిదానానికి కూడా వెనుకాడరు. ఉగ్రవాదులు సాధారణ జనంలో కలిసిపోయి, సరైన సమయంలో దాడి చేయడం జరుగుతుంది. అత్యాధునిక ఆయుధాల సులభ లభ్యత, జనాభా పెరుగుదల, రాజకీయ-సాంఘీక-సాంస్కృతిక- ఆర్థిక సమస్యలు, ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తులు, అవిద్య, అక్రమార్జన, పేదరికం, లంచగొండితనం, జాతిమత విభేధాలు, ఆర్థిక అసమానతలు, భాషాభేదాలు, మతం పేరున అంధ విశ్వాసాలు లాంటివి ఉగ్రవాదానికి కారణాలు అవుతున్నాయి. ఉగ్రవాదంతో ప్రజల్లో అభద్రతాభావం, భయం, ప్రాణాలు కోల్పోవడం, ఆస్తి నష్టం, దేశం అస్థిరం కావడం లాంటి దుష్ప్రభావాలు కలుగుతాయి.

భారతదేశంలో ఉగ్రవాదాన్ని మట్టుబెట్టుటకు పోలీసులు, ఇంటలిజెన్స్, మిలిటరీలతో పాటు ఉగ్రవాద వ్యతిరేక ప్రత్యేక శిక్షణలు పొందిన ఆంటీ-టెర్రరిజమ్ స్క్వాడ్, రీసెర్చి అనాలిసిస్ వింగ్ (ఆర్ఏడబ్ల్యూ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (యన్ఐఏ), విఐపి భద్రతలను కాపాడే కమెండో దళాలు లాంటివి నిరంతరం పని చేస్తున్నాయి. ప్రపంచానికి పెను సవాళుగా నిలిచిన ఉగ్రవాద ఊడలను పెకిలించడానికి రక్షక బలగాలతో పాటు ప్రజా సహాయం, చట్టాల కఠిన అమలు జరుగుతూ ఉండాలి. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో తొలగించడానికి ప్రపంచ మానవాళి సత్వరమే ఏక తాటిపైకి రావలసిన అత్యవసర పరిస్థితులు వచ్చాయి.

# నిరుద్యోగ యువతకు అప్రమత్తత అవసరం




- విదేశాల్లో ఉద్యోగం పేరిటి మోసపు వలలు ● యువతను నమ్మించి విదేశీ ముఠాలకు విక్రయిస్తున్న ముఠాలు
- ఫారిన్ జాబ్స్ పేరుతో రష్యా ఆర్మీలో భారత యువతను చేర్పించిన వైనం ● జాబ్ స్కామ్లు, టాస్క్ గేమ్ వంటి సైబర్ ఫ్రాడ్స్ కు పాల్పడుతున్న తీరు ● కేవలం విజిటింగ్, స్టూడెంట్ వీసాలపై తతంగమంతా సాగుతోంది

-మహమ్మద్ ఆరిఫ్
7013147990

'విదేశాల్లో పెద్ద ఉద్యోగం. ఏసీ రూముల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పని. రూ.లక్షల్లో సంపాదన' అని చెప్పి నిరుద్యోగ యువతను నమ్మించి విదేశీ ముఠాలకు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యులను విశాఖ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఫారిన్ జాబ్స్ పేరుతో గతంలోనూ రష్యా ఆర్మీలో భారత యువతను చేర్పించిన విషయం బయటికొచ్చింది. అంతేకాకుండా చాలా మంది గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల పేరుతో విజిటింగ్ వీసాలపై పంపి మోసం చేస్తున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. అందుకే విదేశాల్లో ఉద్యోగం అంటే ఒకటికి రెండు సార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. విశాఖలో వెలుగుచూసిన ఫారిన్ జాబ్ స్కామ్ లో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూశాయి. కంబోడియాలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పని చేయడానికి పిలిచి.. వారిని చైనా కంపెనీ ఏజెంట్లకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ వారితో జాబ్ స్కామ్లు, టాస్క్ గేమ్ వంటి సైబర్ ఫ్రాడ్స్ చేయిస్తున్నట్లు నిర్ధారించారు. రెండేళ్లలో ఏజెంట్ల ద్వారా తెలంగాణ, ఏపీతోపాటు దేశవ్యాప్తంగా ఐదువేల మంది కంబోడియా వెళ్లినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. వీరిని చైనా ముఠాలు కొనుక్కొని.. సైబర్ నేరాలపై శిక్షణ ఇచ్చి మోసాలు చేయిస్తున్నట్లు గుర్తించారు. ఎవరైనా నిరాకరిస్తే చీకటి గదుల్లో పెట్టి చిత్రహింసలకు గుర్తిచేస్తున్నారని ఓ బాధితుడు పోలీసులకు తెలిపాడు. అంతేకాకుండా కొంతకాలం క్రితం రష్యాలో ఉద్యోగాల పేరిట కొందరు ఏజెంట్లు భారతీయులను తీసుకువెళ్లి రష్యా ఆర్మీలో సహాయ సిబ్బందిగా చేరుస్తున్నారని విదేశాంగ శాఖ గుర్తించింది. అలాంటి ఉద్యోగాల్లో చేరి తమ ప్రాణాలను ప్రమాదంలో పడేసుకోవద్దని హెచ్చరించింది. టర్కీ సమీపంలోని అజర్ బైజాన్ కు 29 మందిని స్టూడెంట్ వీసాపై తీసుకెళ్లి.. ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేసిన ఘటన గతంలో శ్రీకాకుళంలో వెలుగుచూసింది. అక్కడి పోలీసులు గుర్తించి బాధితులను ఇండియాకు తిరిగి పంపించారు. విశాఖపట్నంలో ఓ కన్సల్టెన్సీ సంస్థ సౌదీలో రెండేళ్ల పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని 76 మంది నుంచి రూ. 60వేల చొప్పున వసూలు చేసింది. విజిటింగ్ వీసాపై సౌదీకి తీసుకెళ్లి పని కల్పించింది. అయితే ఆరు నెలలకే వీసా గడువు ముగియడంతో ఆ దేశం వారందరినీ ఇండియాకు వెనక్కి పంపించేసింది. బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు.

**డబ్బులు వసూలు చేసి..**

విదేశాల్లో ఉద్యోగాల ఆశ చూపి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటనలు గతంలో అనేకం వెలుగుచూశాయి. స్వీడన్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖలో ఓ సంస్థ నిరుద్యోగులకు టోకరా వేసింది. 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. యూరప్, మలేషియా పంపిస్తామని ఏజెంట్లు మోసం చేశారని జగిత్యాలలో చాలా మంది పోలీసులను ఆశ్రయించారు. అంతేకాకుండా తెలంగాణ వంటి రాష్ట్రంలో గల్ఫ్ మోసాలు తరచూ బయటపడుతూనే ఉంటాయి. గల్ఫ్ పంపిస్తానని నిజామాబాద్ జిల్లాలో ఓ ఏజెంట్ రూ. 4 కోట్ల వరకు వసూలు చేసి పరారయ్యాడు. విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలు ఎక్కువగా తూర్పు ఐరోపా దేశాలు, గల్ఫ్ కంట్రీస్, ఇజ్రాయెల్, కెనడా, మయన్మార్ వెళ్లే నిరుద్యోగులకు ఎదురవుతున్నట్లు భారత విదేశాంగ శాఖ గుర్తించింది. అందుకే విదేశాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు చేయాలనుకుంటే రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెంట్స్ ను మాత్రమే సంప్రదించాలని, చట్టపరమైన నిబంధనలను అనుసరించి మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచిస్తున్నది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడేవారు ఎక్కువగా వాట్సాప్, ఫేస్బుక్, ట్విటర్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారానే సంప్రదిస్తున్నారని, తమ ఆఫీసు అడ్రస్గానీ, ఇంటి అడ్రస్గానీ తెలియనివ్వడం లేదని గుర్తించింది. అందుకే రిజిస్టర్డ్ ఏజెంట్లందరూ తమ కార్యాలయం ఎదుట ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ ను కచ్చితంగా డిస్ప్లే చేయాలని కేంద్రం ఆదేశించింది. ప్రభుత్వ గుర్తింపులేని రిక్రూటింగ్ ఏజెంట్లెవరైనా నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి విదేశాలకు పంపిస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించింది. ఇమ్మిగ్రేషన్ చట్టం-1983 ప్రకారం ఇది మానవ అక్రమ రవాణా కిందికి వస్తుందని స్పష్టం చేసింది. మెరుగైన ఉపాధి కోసం చాలా మంది భారతీయులు విదేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే చాలా మంది నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతూ, ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అందుకే విదేశీ ఉద్యోగ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రిజిస్టర్ చేయని రిక్రూట్మెంట్ ఏజెంట్ల ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవద్దని పేర్కొంటున్నారు. ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారు ముందుగా ఏజెంట్ వివరాలను తెలుసుకోవాలి. విదేశాంగ శాఖలో ఏజెంట్గా నమోదు చేసుకున్నారా లేదా పరిశీలించాలి. ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ నంబర్ చెక్ చేయడానికి %వఎఅస్త్రతీఖ్వ.స్త్రశీజ.ఱఅ% అనే భారత ప్రభుత్వ వెబ్సైట్ను విజిట్ చేయాలి. అసలైన ఏజెంట్ల రిజిస్ట్రేషన్ నంబర్లు ఈ వెబ్సైట్లో లిస్ట్ అయి ఉంటాయి. అంతేకాకుండా ఆఫర్ లెటర్ను నిశితంగా పరిశీలించాలి. ఉద్యోగ నిబంధనలు, షరతులతో పాటు జీతం, జాబ్ కాంట్రాక్ట్ వివరాలు లేకుంటే ఆ ఆఫర్ లెటర్ మోసపూరితమని గ్రహించాలి.

# కమాన్ స్కూల్ విధానం కల్లలేనా?




- విద్య,వైద్యం తప్ప అన్ని ఫ్రీగా ఇస్తామంటున్న రాజకీయ పార్టీలు ● పార్లమెంట్ లో ఆమోదించి, 60 ఏండ్లు గడిచినా కానరాని కామన్ స్కూల్ ఎడ్యుకేషన్ ● గత ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పిన ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం కేజీ టు పీజీ అమలు కాలేదు ● కేవలం గురుకులాలనే అన్నింటా ప్రోత్సహిస్తూ మిగతా బడులపై నేటికీ తీవ్ర నిర్లక్ష్యం ● సామాజిక విభజనకు సంబంధించిన ప్రభావాలు పాఠశాల మీద పడకూడదన్న కొఠారీ కమిషన్

పాకాల శంకర్ గౌడ్
9848377734.

ఓట్లు పండుగ వచ్చిందంటే చాలు మేధావి వర్గం ప్రజలకు ఏం ఇవ్వాల్సిన అవసరం లేదు నాణ్యమైన విద్య, వైద్యం ఇస్తే చాలు అనే చర్చ చేస్తది.పాపం వారి మాటలు రాజకీయ పార్టీలకు రుచించవనుకోండి. రాజకీయ పార్టీలు మాత్రం విద్య,వైద్యం తప్ప అన్ని ఫ్రీగా ఇస్తాం అన్నట్లుగా మాట్లాడతాయి.జాతీయ విద్యా విధానం ప్రతిపాదించి, పార్లమెంట్ లో ఆమోదించి, 60 ఏండ్లు గడిచినా, అనేక మంది పాలకులు మారిన దేశంలో నేటికి కామన్ స్కూల్ (కామన్ స్కూల్ ఎడ్యుకేషన్) అమలు నోచుకోని హామీగా,కలగానే మిగిలింది. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన మొదటి ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం కేజీ టు పీజీ అమలుకు నోసుకోలేదు. కేవలం గురుకులాలను ప్రోత్సహిస్తూ మిగతా బడులను నిర్లక్ష్యం చేసింది.కలెక్టర్ పిల్లవాడైన కడుపేద పిల్లవాడైన ఒకే బడిలో చదివేలా విద్యావిధానాన్ని రూపొందించి అమలు చేస్తామని నాడు హామీ ఇచ్చారు. విద్యారంగంలో ఉన్న వివిధ యాజమాన్యాలను ఒకే యాజమాన్యానికి కిందికి తీసుకవచ్చి కామన్ స్కూల్ సిస్టం గా ఏర్పాటు చేస్తామని (కేజీ టు పీజీ) చెప్పింది.ఒకే యాజమాన్యం ఒకే సిలబస్,అమీర్ నుండి గరిబ్ అందరూ చదువుకునే చదివే కామన్ స్కూల్ ఎడ్యుకేషన్.నేటి ప్రభుత్వం మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ పెడతామని,వాటిలో మంచి వసతులు కల్పించి, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన విద్యను ఉచితంగా అందిస్తామని అంటుంది. విద్యారంగంలో కామన్ స్కూల్ ఆశయాన్ని మొట్టమొదటిసారిగా 1964-66 లో ప్రస్తావించింది కొఠారి కమిషన్. దేశంలోని పాఠశాల విద్యారంగాన్ని, ఉన్నత విద్యారంగాన్ని పరిశీలించి తగిన సిఫారసులు చేయడం కొరకు నాటి యుజిసి చైర్మన్ డి ఎస్ కొఠారి అధ్యక్షతన కమీషన్ ఏర్పాటు చేసింది నాటి కేంద్ర ప్రభుత్వం.కొఠారి కమిషన్ ఏర్పడే నాటికి దేశవ్యాప్తంగా వివిధ యాజమాన్యాల కింద వివిధ రకాలుగా పాఠశాలలు నడపబడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు,స్థానిక సంస్థలు నడుపుతున్న పాఠశాలలు, ప్రైవేటు,ఏడేడ్ పాఠశాలలు స్వచ్ఛంద సంస్థ నడుపుతున్న పాఠశాలలు, కొన్ని గుర్తింపు లేని పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ విద్యారంగ విస్తరణ కొరకు పాఠశాల సంఖ్యను పెంచడం కంటే కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, ఆవేశ ప్రాంత పాఠశాల విధానం మీద ఆధారపడి ఈ కామన్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉండాలని కొఠారి కమిషన్ చెప్పింది.1968లో మొదటి జాతీయ విద్యా విధానంలో,1986లో రెండవ విధానంలో మరియు 1992లో సవరించిన సంస్కరణలో ఈ కామన్ స్కూల్ ఎడ్యుకేషన్ పొందుపరచబడింది.1986 మరియు 1992 విధాన ప్రకటనలను పార్లమెంటు కూడా ఆమోదించింది.ప్రపంచంలో అభివృద్ధి చెందిన,అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏదో ఒక రూపంలో కామన్ స్కూల్ విధానం అమలులో ఉంది.సమాజంలో ధనవంతులకు,పేదవారికి మధ్య చదువుకున్నవారికి చదువు రాని వారికి మధ్య వివిధ మతాల, కులాల మధ్య ఉన్న దూరం విద్యారంగాన్ని ప్రభావితం చేసిందని ఈ విభేదాలు అంతరాల్లో చిక్కుకొని ప్రజలు విభజింపబడి ఉన్నారని సామాజిక విభజన ఒక సాధారణ ప్రభుత్వ పాఠశాలను సమాజానికి దూరంగా ఉంచిందని కొఠారి కమిషన్ గ్రహించి,ప్రత్యామ్నాయంగా కామన్ స్కూల్ విధానాన్ని చూపింది. సామాజిక విభజనకు సంబంధించిన ప్రభావాలు పాఠశాల మీద పడకూడదని, పాఠశాల స్థానిక సమాజంతో సన్నిహితంగా కలిసిపోవాలని, సామాజిక భాగస్వామ్యం పెరిగి జాతీయ అభివృద్ధికి ముఖ్యంగా సామాజిక సమగ్రతకు, జాతీయ సమగ్రతకు దోహదపడాలని కొఠారి కమిషన్ భావించింది.కామన్ స్కూల్ విధానంలో ప్రభుత్వ పాఠశాలలకు స్థానిక సంస్థల పాఠశాలకు మాత్రమే కాకుండా ప్రైవేట్ పాఠశాలలకు కూడా కొఠారి కమిషన్ చోటు కల్పించింది. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలు మాదిరిగానే పనిచేస్తూ సేవా దృక్పథం కలిగి ఉండాలని భావించింది. ఆవాస ప్రాంత పాఠశాల విధానంలో ఒక పాఠశాలకు దాని ఆవాస ప్రాంతాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో ఉన్న విద్యార్థులందరూ కుల,మత, జాతి తో సంబంధం లేకుండా ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా సామాజిక హోదాతో సంబంధం లేకుండా ఆవాస ప్రాంతంలో ఉన్న పాఠశాలలకు మాత్రమే వెళ్లాలి.సమాజంలోని ఉన్నత వర్గాల చెందిన వారు కూడా ఆవాస ప్రాంతం పాఠశాలకు రావడం వలన వారికి సాధారణ విద్యార్థులతో జీవిత అనుభవాలను పంచుకునే అవకాశం కలుగుతుందని, కుల మత తత్వాలకు అతీతంగా ప్రజల్లో లౌకిక తత్వం పెరుగుతుందని భావించింది.ఆర్థికంగా సామాజికంగా పలుకుబడి కలిగిన వర్గాలకు చెందినవారు ఆవాస ప్రాంత పాఠశాలలకు రావడం వలన పలుకుబడి గల వర్గాలు కామన్ స్కూల్ మీద ఆవాస ప్రాంత పాఠశాలల మీద మొత్తంగా ప్రభుత్వ విద్యా రంగం మీద ఆసక్తి కలిగి ఉంటాయని కమిషన్ అభిప్రాయపడింది. కామన్ స్కూల్ విధానం విద్యారంగంలో ఒక విప్లవం వంటిదని సమాజంలో జరగవలసిన సామాజిక ఆర్థిక సంస్కృతిక విప్లవాలకి అది బాట వేస్తుందని కొఠారి కమిషన్ భావించింది.ఈ కామన్ స్కూల్ లక్ష్య సాధన కోసం ప్రభుత్వాలకి కాలవ్యవధిని నిర్ణయించింది. దీర్ఘకాలికంగా 20 సంవత్సరాల కాలంలో కామన్ స్కూల్ లు ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలని భావించింది. ఆ గడువు 1986 తో ముగిసిపోయింది.ఇప్పటికీ పాలకులు పట్టించుకున్న దాకలాలు లేవు.కుల మతాల పేరుతో గురుకులాలను ఏర్పరచి పసిప్రాయంలోనే కులమత బీజాలను బాలలలో నాటుతున్నారు.

విద్య వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ 1980 దశకం లో ప్రారంభమైంది.1990లో విద్యా వ్యాపారం బాగా విస్తరించింది. నేడు విద్యారంగం ప్రైవేటు కార్పోరేటివ్ శక్తుల కదంబ హస్తాల్లో బంధీ అయి విలవిల లాడుతుంది. దేశంలోని ప్రజలకు కామన్ స్కూల్ కలగానే మిగిలిపోయింది. నూతన జాతీయ విద్యా విధానం (%చీజు‌ూ%- 2020) ప్రకారం విద్య లో పెట్టిన పెట్టుబడులు మానవ వనరులు తయారు చేస్తాయని, అవి ప్రపంచ మార్కెట్ లను అభివృద్ధి పరుస్తాయని, నైపుణ్యవంతమైన ప్రపంచ స్థాయి విద్యార్థులను తయారు చేసే విధంగా రూపొందించబడింది. కామన్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు లేవు.భారతదేశపు భవిష్యత్తు తరగతి గదిలో రూపొందుతుందని కొఠారి కమిషన్ ఆశించింది. ఆ తరగతి గది కులమతాలకతీతంగా, సామాజిక ఆసమానతలకతీతంగా రూపొంది జాతీయ సమగ్రతకు తోడ్పడుతుందని, లౌకికత్వాన్ని కలిగి ఉంటుందని కొఠారి కమిషన్ ఆశించింది. కమిషన్ ఏర్పడి 60 ఏళ్లు గడిచిన కమిషన్ ఆశయ సాధనకు నాటి నుండి నేటి వరకు చిత్తశుద్ధితో కృషి చేసిన పాలకులు లేరు స్వతంత్ర భారతంలో విద్యా కమిషన్లు ఏర్పాటు చేయడం కమిషన్ల ప్రతిపాదనలను పక్కన పెట్టడం జరుగుతూనే ఉంది. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా కామన్ స్కూల్ ఆశయాన్ని అమలు చేసే దిశగా, భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యసాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. మొన్నటివరకు కేజీ టూ పీజీ,నేడు ఇంటర్నేషనల్ స్కూల్ అంటూ పాలకులు మాట్లాడుతున్నారు.ఏండ్లుగా కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి, ప్రీ ప్రైమరీలను ప్రారంభించి, ఉన్నత పాఠశాలలను మినీ గురుకులాలుగా మార్చి,ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకొని, కుల,మత, సామాజిక ఆర్థిక అసమానతులకు అతీతంగా అందరికీ నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటే కామన్ స్కూల్ కల కొంతవరకైనా నిజమయ్యే అవకాశం ఉంటుంది.

# వైద్యమూ - వాణిజ్యమూ



వైద్య సేవల్ని వినియోగ దారుల రక్షణ చట్టం పరిధిలోకి తీసుకువచ్చిన 1995 సంవత్సరపు తీర్పు పై పునరాలోచించాలని సుప్రీం కోర్టు అభిప్రాయ పడడం ఒక మంచి పరిణామం.ఇప్పటికే న్యాయ సేవల్ని ఈ చట్టం పరిధి నుండి మినహాయిస్తూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. వైద్యం, వ్యాపార గుణాన్ని సంతరించుకోవడం నేటి నిజం.

అలా అని ఆ పవిత్ర వృత్తి ని పూర్తిగా వ్యాపారంగా లెక్కకట్టడం తప్పు.అలా చెయ్యడం వల్ల అంతిమంగా ప్రజలకు జరిగే నష్టమే ఎక్కువ.వైద్యుడికీ,రోగికీ ఉన్న సంబంధం,ఉండాల్సిన సంబంధం అమ్మకం దారుకీ, కొనుగోలుదారుకీ ఉన్న సంబంధం కాదు. దాన్ని కేవలం లాభ నష్టాల కోణంలో నిర్వచించలేం.అది నమ్మకం తో,గౌరవం తో ముడిపడి ఉంటుంది.వినియోగ దారుల రక్షణ చట్టం పరిధిలోకి వైద్య సేవల్ని తీసుకురావడం వల్ల ఆ సేవలు ఖరీదుగా మారాయి.తన విజ్ఞానం,నైపుణ్యం స్వేచ్ఛగా వాడి,రోగ నిర్ధారణ,చికిత్స అందించాల్సిన వైద్యుడు,కొంత భయంతో రక్షణాత్మక వైఖరి తీసుకోవడం వల్ల అవసరానికి మించి వైద్య పరీక్షలు చేయించాల్సి వస్తుంది.సత్వర వైద్యం సరియైనది అనుకున్నది అందించడం కన్నా,తన వాదనకు మద్దతుగా మరిన్ని సాక్ష్యాలకై వెదుకులాడవలసి వస్తున్నది.ఉదాహరణకు వైరల్ జ్వరాల సీజన్ లో ఒక రోగి కి వచ్చిన జ్వరం వైరల్ జ్వరమే అని తన అనుభవం,జ్ఞానం, డయాగ్నొస్టిక్ నైపుణ్యం చెప్తున్నా,దాని నిరూపణకై ఎక్కువ టెస్టులు రాయాల్సిన అగత్యం ఏర్పడుతుంది.రోగి ఖర్చు తడిసి మోపెడవుతుంది.ఇది ఒక కోణం.ఇంకో కోణం ఏమిటంటే రోగనిదానం పూర్తిగా వైద్యుని చేతిలో ఉండదు. ఎంత ఉత్తమ సేవలందించినా కొన్ని వేళల తన చెయ్యి దాటే పరిస్థితి.అలాంటి స్థితిలో తాను మళ్ళీ ఎలాంటి ఉదాసీనత చూపలేదని నిరూపించుకోవాల్సి రావడం వైద్యునికి మరో పెద్ద సవాల్.ఇవన్నీ నాకెందుకు అనుకుని వైద్యుడు 'చికిత్స అందించడం నా వల్ల కాదు, మరోచోటికి తీసుకుపొండి ' అంటూ తిరస్కరించవచ్చు.ఆ విధంగా కూడా సమయానికి వైద్యమందక రోగికి నష్టమే. ఎలాగూ వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించని రీతిలో చట్టాలున్నాయి.వాటిని వినియోగించుకోవచ్చు. వాటితో పాటు వైద్య సేవల్ని వినియోగ దారుల సేవలుగా భావిస్తే వైద్యులపై,సమాజం పై అదనపు భారం.న్యాయ సేవల లాగానే వైద్య సేవల్ని కూడా ఈ చట్టం నుండి మినహాయించడం మంచిది. దీనితో బాటు వైద్యులు,ఆరోగ్య సిబ్బంది,ఆసుపత్రులపై దాడుల్ని కూడా ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలి.నివారించాలి.జరిగినప్పుడు కఠినంగా శిక్షించాలి.మరో వైపు వైద్యులు కూడా వైద్యం వాణిజ్య రూపం సంతరించుకోకుండా తమ శక్తి మేరకు కృషి చెయ్యాలి.రోగిని కేసు లా, కస్టమర్లా కాకుండా మిత్రునిలా చూడాలి.రోగ నిదానం,చికిత్స, అవకాశాలు అన్నీ సహానుభూతి తో అతనితో చర్చించాలి.పరస్పర నమ్మకమే ఆరోగ్య సేవలకు పునాది. సమాజానికి ఆరోగ్యకరం.

డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ.
9440836931.



# వానాకాలానికి రైతు భరోసా లేనట్లే

- రైతుల ఆశలను అడియాశలు చేసిన రేవంత్ సర్కార్
- కేసీఆర్ ఇచ్చినంత సొమ్మునే రైతుల ఖాతాలో వేసి చేతులు దులుపుకున్న తీరు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ ఏర్పాటు తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం ఇస్తూ వచ్చింది. రైతుబంధు పేరిట ఏడాదికి రెండు విడతల్లో పదివేల రూపాయల సాయం అందించింది. అయితే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు పెట్టుబడి సాయం పెంపు హామీ ఇచ్చింది. కేసీఆర్ ఏడాదికి రూ.10 వేలు ఇస్తే తాము ఏడాదికి పదిహేను వేల రూపాయలు ఇస్తామని ఆశ చూపింది. దీంతో రైతులు బీఆర్ఎస్ను కాదని కాంగ్రెస్ వైపు మళ్లారు. కానీ, రేవంత్ సర్కార్ మాత్రం రైతుల ఆశలను అడియాశలు చేసింది. పాత పద్ధతిలోనే అంటే కేసీఆర్ ఇచ్చినంత సొమ్మునే రైతుల ఖాతాలో వేసి చేతులు దులువుకుంది. హామీని విస్మరించి రైతుభరోసా సాయం పెంచకపోవడంపై ప్రతిపక్షాలతో పాటు రైతులు రేవంత్ సర్కారుపై ఆగ్రహంతో ఉన్నారు.

ఈ నేపథ్యంలో నిన్న గంటల తరబడి జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు రైతుభరోసాపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఖరీఫ్కు కూడా రైతుభరోసా ఇవ్వట్లేదని ఆయన స్పష్టం చేశారు. రైతుభరోసా ఎప్పుడు వేస్తారు అని మీడియా ప్రతినిధి అడగిన ప్రశ్నకు శ్రీధర్బాబు ఏమన్నారంటే.. ఎకరానికి రూ. 15 వేలు రైతు భరోసా కింద ఇవ్వాలంటే విధివిధానాలు, నిబంధనలు ఖరారు చేయాలి. ఖరీఫ్ పంట అయిపోయిన తరువాత చూద్దాం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తాం. రైతుబంధుతో పాటు మిగతా హామీలను కూడా నెరవేరుస్తాంఅన్నారు. దీంతో ఈసారి కూడా రైతుభరోసా లేదని తేలిపోయింది.

# విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వాలి

## మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాష్ట్రంలో విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించాలని బిజెపి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ రాజకీయాల్లో అతి ముఖ్యమైనది నమ్మకం. నమ్మకద్రోహాన్ని ప్రజలు సహించరని సీఎం రేవంత్ రెడ్డికి సూచిస్తున్నాను. 4 కోట్ల తెలంగాణ ప్రజలకు నమ్మకద్రోహం చేయాలనుకుంటే మీ రాజకీయ భవిష్యత్తు అంధకారమవ్వక తప్పదన్నారు. ముఖ్యమంత్రి పదవి శాశ్వతం కాదు.. ప్రజల కోసం చేసే పనులే శాశ్వతం గెలిచాక ప్రజలకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి మాటలు మర్చుతున్నారు. మేనిఫెస్టోలో ప్రజలకు హామీలిచ్చి అమలు చేయకుండా, ప్రజలేం చేస్తారులే అనుకుంటే రాజకీయంగా కాలగర్భంలో కలవక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్ షిప్పులు సుమారు రూ. 7 వేల కోట్లు పెండింగులో ఉన్నాయి. విద్యార్థులు ప్రైవేట్ కాలేజీల్లో సర్టిఫికెట్ల కోసం వెళ్తే ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిలు రాలేదని ఫీజులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు చెబుతున్నాయి.

పేద మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు కట్టలేక చాలా మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్న దుస్థితి నెలకొంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే సుమారు రూ. 4 వేల కోట్లు పాత కాంట్రాక్టుల బిల్లులు చెల్లించారు. గత ప్రభుత్వం విడుదల చేయాలనుకున్న రైతుబంధు నిధులు రూ. 7 వేల కోట్లు ప్రభుత్వ ఖజానాలో మిగిలి ఉంటే అందులో రూ. 4 వేల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన కాంట్రాక్టుల బిల్లుల కోసం మళ్లించారు. కాని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించేందుకు మనసు రాలేదు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పాత కాంట్రాక్టులకు బిల్లులు ఇస్తోంది తప్పితే ఫీజు రీయింబర్స్ మెంట్ బిల్లులు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. కాంగ్రెస్ సర్కారు కాంట్రాక్టులకు బిల్లులు చెల్లించేది కేవలం హైకమాండ్ కు ముడుపులు చెల్లించేందుకే గతంలో ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం రూ. 2 వేల కోట్లకు టోకెన్లు జారీ చేశారు.

కాని, నిధులు విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో సుమారు రూ. 1400 కోట్లు ఆరోగ్య శ్రీ బకాయిలు పేరుకుపోయాయి. దాదావు 70-80 శాతం మేర ఆసుపత్రులలో ఆరోగ్య శ్రీని అమలు చేయలేని దుస్థితి ఎదురైందన్నారు. పేద ప్రజలకు వైద్యం సక్రమంగా అందాలంటే పెండింగులో ఉన్న ఆరోగ్య శ్రీ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా రూ. 10 లక్షల ఆరోగ్య శ్రీ కార్డులను వెంటనే పేదలకు అందించాలి. కాంగ్రెస్ పరిపాలన మొత్తం పత్రికల్లో ఫ్రంట్ పేజీలకే పరిమితమైందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన నాలుగు వాయిదాల కరువు భత్యాలు (డీఏలు) ఇంతవరకు గత ప్రభుత్వం చెల్లించలేదు.. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతిలో ఉదాసీన వైఖరి అవలంభిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంతవరకు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోలేదు వారి సమస్యలు వినేందుకు కనీసం అపాయింట్ మెంట్ ఇచ్చింది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు కరువు భత్యాలను (డీఏ) సక్రమంగా చెల్లిస్తున్నది. రాష్ట్రంలో ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు.

ఉద్యోగస్థుల ఆరోగ్య స్కీం (హెల్త్ స్కీం), మెడికల్ రీయింబర్స్ మెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా దశాబ్ది ఉత్సవాల కోసం సుమారు 500 కోట్ల రూపాయలను ప్రజాధనాన్ని వెచ్చించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి దశాబ్ది ఉత్సవాలంటూ హడావుడి చేస్తోందన్నారు.రాష్ట్రంలో యాసంగి సీజన్ లో 55 లక్షల ఎకరాల్లో వరిపంట వేశారు. కోటి 50 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం 36 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే సేకరించి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. ముందస్తు వర్షాలతో చాలాచోట్ల వరిధాన్యం తడిసి ముద్దయిపోయి రైతులు నష్టపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లు, దొడ్డు వడ్లు అనే తేడా లేకుండా రూ. 500 బోనస్ ఇవ్వాల్సిందే. సన్నవడ్లకు మాత్రమే బోనస్ అంటూ సన్నాయినొక్కులు నొక్కొద్దని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ఆరోగ్య శ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలి. రూ. 10 లక్షల ఆరోగ్య శ్రీ కార్డులను వెంటనే అమలు చేయాలి. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఆన్ లైన్ లో అప్లై చేసుకునేలా వెసులుబాటు కల్పించాలి. ధాన్యానికి బోనస్ ఇవ్వకుంటే బాక్సులు బద్దలవుతాయని హెచ్చరిస్తున్నాం. వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు డీఏను రిలీజ్ చేసి.. పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో
# ఏసీపీ ఉమామహేశ్వరరావు అరెస్ట్

- ఇవాళ ఏసీపీ ఉమామహేశ్వరరావు నివాసంలో ఏసీబీ సోదాలు
- మరో ఏడు చోట్ల కూడా సోదాలు
- రూ.3 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం
- ఏసీపీ ఉమామహేశ్వరరావును నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న ఏసీబీ



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇవాళ ఏసీపీ ఉమామహేశ్వరరావు నివాసంలో, ఆయనకు సంబంధించిన ప్రదేశాల్లో ఏకకాలంలో తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది చోట్ల ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన అక్రమార్జనకు సంబందించిన ఆధారాలు సేకరించిన ఏసీబీ అధికారులు ఏసీపీ ఉమామహేశ్వరరావును ఆయన నివాసంలోనే అదువులోకి తీసుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనను అరెస్ట్ చేశామని ఏసీబీ జేడీ సుధీంద్ర బాబు వెల్లడించారు. ఆయనను రేవు కోర్టులో ప్రవేశపెడతామని తెలిపారు.

సోదాల్లో 17 ఆస్తులు గుర్తించామని, ఘట్ కేసర్ లో ఐదు ప్లాట్స్, శామీర్ పేటలో విల్లా గుర్తించామని చెప్పారు. ఏసీపీ ఉమామహేశ్వరరావుకు చెందిన రెండు లాకర్లు గుర్తించామని పేర్కొన్నారు. రూ.38 లక్షల నగదు, 60 తులాల బంగారం సీజ్ చేశామని చెప్పారు. ఇప్పటివరకు మార్కెట్ విలువ ప్రకారం రూ.3 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ జేడీ వివరించారు. ఇందులో భాగంగా ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నరని ఆరోపణ నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. సాహితీ ఇన్ఫ్రా కేసుల విచారణ అధికారిగా ఉన్న ఉమామహేశ్వరరావు.

అశోక్ నగర్ లో ఉమామహేశ్వరరావు ఇంట్లో సోదాలు చేపట్టారు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో పనిచేస్తున్న సమయంలో రియల్ టర్ మర్డర్ కేసులో సస్పెండ్ అయిన ఉమామహేశ్వరరావు సస్పెండ్ అయ్యారు. డబల్ మర్డర్ కేసులో డబ్బులు తీసుకుని కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడంతో అప్పటి సీపీ ఉమామహేశ్వర ను సస్పెండ్ చేశారు. అంతేకాక రియల్ ఎస్టేట్ వ్యాపారం సెటిల్మెంట్లలో కోట్లాది రూపాయలు వసూలు చేశారని ఆరోపణలు సైతం ఉన్నాయి. ఉమామహేశ్వరరావు పై మరింత లోతుగా విచారణ జరిగితే అసలు విషయం బయటకు వస్తుందని బాధిత వర్గాలు అభిప్రాయపడుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే
# పేదలకు న్యాయం

- వైట్ రేషన్ కార్డు లేకుండా ఆరోగ్యశ్రీ అమలు చేయడం అభినందనీయం
- ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశారు
- ఆరవ గ్యారెంటీ ఎన్నికల కోడ్తో నిలిచిపోయింది
- ఎన్నికల ఫలితాలు అనంతరం పూర్తిగా ఆరు గ్యారెంటీలు అమలు అవుతాయి
- సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ రావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కాంగ్రెస్ తోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో కూకట్ పల్లి, శేరి లింగంపల్లి, ఆందోల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలువు కోసం పనిచేసిన సంజీవరావును అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవరావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు పథకాలు అమలు చేయడంలో భాగంగా రేషన్ కార్డులు జారీకి సమయం లేకుండానే పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో లబ్ధిదారులకు వైట్లే రేషన్ కార్డులు ప్రభుత్వం జారీలు చేయలేకపోయిందన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోయినప్పటికీ వైట్ రేషన్ కార్డు జారీ చేయనప్పటికి అన్ని వర్గాల ప్రజలకు ఐదు లక్షల రాజు ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచుతూ అందరికి వర్తింపజేయడం హర్షించదగ్గ పరిణామం అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని అన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరుగుతుందన్న ఆవేదనతో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో బస్సు రవాణా సౌకర్యం, 2 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వడం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకం వర్తింపజేయడం, ఐదు లక్షల నుండి 10 లక్షల రూపాయలకు రాజు ఆరోగ్యశ్రీ పథకం పెంచడం, ఇందిరమ్మ ఇల్లా లబ్దిదారులకు మహిళలకు ఐదు లక్షల రూపాయలు వర్తింపజేయడం లాంటి పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఆరో పథకాన్ని ఎన్నికల కోడ్ ఉన్నందున పరిగణలోకి తీసుకోలేరని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసి ప్రజల సంక్షేమాన్ని కృషి చేసిందన్నారు. అయితే పేదలను పట్టించుకోని భారత రాష్ట్ర సమితి నాయకులు ఆరు గ్యారెంటీలను అవమానపరిచే విధంగా మాట్లాడుతున్నారని, వారు మాట్లాడిన మాటలకు బహుమతిగా ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ కి బుద్ధి చెప్పారని అది ఎన్నికల ఫలితాల్లో తెలుస్తుందని డాకా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా భారతీయ జనతా పార్టీ మతతత్వంతో రాజకీయాలు చేస్తూ ప్రజలను విడదీస్తుందని ఆరోపించారు. ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్రంలో 14 ఎంపీ స్థానం కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ దేశంలో సైతం సోనియా గాంధీ రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవరావు ధీమా వ్యక్తం చేశారు.

## ఈ వ్యవహారం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతా

- మేడ్చల్ జిల్లా సుచిత్రలోని భూమిపై వివాదం
- మాదంటే మాదంటున్న మల్లారెడ్డి, అడ్లూరి లక్ష్మణ్
- తనకు రేపు సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్ మెంట్ ఖరారైందన్న మల్లారెడ్డి
- తన వద్ద ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఉన్నాయని వెల్లడి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: మేడ్చల్ జిల్లా సుచిత్ర పరిధిలోని తన భూమిని కబ్జా చేస్తున్నారంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి ఇటీవల ఆరోపణలు చేయడం తెలిసిందే. ఈ భూమికి సంబంధించి ప్రభుత్వ సర్వే కూడా ముగిసింది. అయినప్పటికీ, మాజీ మంత్రి మల్లారెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ ల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. సర్వే నెంబరు.82లోని 2.5 ఎకరాల భూమి మాదంటే మాదని ఇరువురు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మల్లారెడ్డి మరోసారి తీవ్రస్థాయిలో స్పందించారు.

తనకు రేవు సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్ మెంట్ ఖరారైందని, ఈ భూమి వ్యవహారాన్ని ముఖ్యమంత్రికి వివరిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ తనను బాగా ఇబ్బంది పెడుతున్నారని, ఫేక్ డాక్యుమెంట్లు, ఫోర్జరీ పత్రాలతో తన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మల్లారెడ్డి మండిపడ్డారు. సుచిత్రలోని భూమికి సంబంధించి తన వద్ద ఒరిజినల్ పత్రాలు ఉన్నాయని, ఆ డాక్యుమెంట్లు ఫేక్ అని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, అలాగే లక్ష్మణ్ వద్ద ఉన్న పత్రాలు సరైనవని నిరూపించలేకపోతే ఆయన రాజీనామా చేసేందుకు సిద్ధమా? అని మల్లారెడ్డి సవాల్ విసిరారు.

## ధాన్యం కొనుగోలు బాధ్యత కలెక్టర్లదే

- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలివే
- తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసింది

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మూడు గంటలకు పైగా కొనసాగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకల్ని ఘనంగా నిర్వహించాలని, ఈ వేడుకలకు ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని కేబినెట్ నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లపై పూర్తి బాధ్యత కలెక్టర్లకే అప్పగించారు. రైతులకు నష్టం జరగకుండా చివరి గింజ వరకూ కొనాలని సీఎం ఆదేశించారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్బాబు మీడియాకు వెల్లడించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే సేకరించాలని నిర్ణయం.ఎంఎస్పీ కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ చెల్లించకూడదని నిర్ణయం.రాష్ట్రానికి అవసరమైన సన్న బియ్యం అంతా రాష్ట్రంలోనే సేకరిస్తాం.


సన్న వడ్లకు క్వింటాల్కు రూ.500 బోనస్. నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠిన చర్యలు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు రూ.600 కోట్లు కేటాయింపు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై మంత్రి శ్రీధర్బాబు అధ్యక్షతన కేబినెట్ సబ్కమిటీ సమావేశమైంది. కాళేశ్వరం ప్రాజెక్టులో మరమ్మతులు చేయాలని నిర్ణయం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై నిపుణుల కమిటీ ఏం చెప్తే అది చేయాలని నిర్ణయం. మంత్రివర్గంలో మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికపైనా చర్చించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం విషయంలో ఎన్డీఎస్ఏ సూచనలకనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పారు. "మేడిగడ్డకు మరమ్మతులు చేస్తే సరి అవుతుందన్న గ్యారెంటీ లేదని, నీరు నిల్వ చేసే పరిస్థితి కూడా లేదని ఎన్డీఎస్ఏ కమిటీ చెప్పింది. అందుకే, తాత్కాలికంగా ఏమైనా ఏర్పాటు చేసైనా సరే రైతులకు నీరు ఇవ్వాలని భావిస్తున్నాం" అన్నారు.

# అక్రమ బియ్యాన్ని తరలిస్తున్న వారి అరెస్ట్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: అక్రమ బియ్యాన్ని తరలిస్తున్న వారిని పోలీసుల అరెస్టు చేశారు. జగిత్యాల నుండి మహారాష్ట్రకి అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్న ఐచర్ వాహనన్ని పట్టుకుని, డ్రైవర్ ని అదువులోకి తీసుకున్న రామగుండం టాస్క్ ఫోర్స్ పోలీసులు. సుమారు 4,50,000/- రూపాయల విలువ గల 150 క్వింటాళ్ళ ప్రభుత్వ రేషన్ బియ్యం మరియు ఐచర్ వ్యాన్ స్వాధీనం చేసుకున్నారు..వివరాల్లోకి వెళితే రామగుండం కమీషనరేట్ మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్ గేట్ సమీపంలో, మంగళ వారం రోజు ఉదయం ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని మహారాష్ట్ర కి అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సంజయ్, ఎస్ఐ ఉపేందర్ గారు, సిబ్బంది తో కలిసి అనుమానిత ఐచర్ వాహనన్ని అపి తనిఖీ చేయగా అందులో సుమారు 150 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. అట్టి ఐచర్ వాహనం నడిపే వ్యక్తి అయినా మహుమూద్ అలీ అనే వ్యక్తిని అదువులోకి తీసుకొని విచారించగా, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన షశీర్ అనే వ్యక్తి జగిత్యాల జిల్లా లో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, మహారాష్ట్ర కి తరలిస్తాడని , అందులో భాగంగానే అతనితో చేసుకున్న ఒప్పందం మేరకు అతనికి సంబంధించిన బియ్యాన్ని ఈ రోజు రహస్యంగా తరలిస్తున్నానని చెప్పినాడు. అనంతరం అతడిని 150 క్వింటాళ్ళ రేషన్ బియ్యం కలిగినా అట్టి ఐచర్ ( బి ఎన్ ఓ టి ఎస్19 టి ఏ 5987) నెంబర్ గల వాహనాన్ని తదుపరి విచారణ నిమిత్తం మందమర్రి పోలీస్ వారికీ అప్పగించారు. ఎండి. మహామూద్ అలీ తండ్రి సర్వర్ , వయస్సు : 36, కులం డ్రైవర్, నివాసం వాంకిడి, ఆసిఫాబాద్ జిల్లా, శంశిర్ ఖాన్ తండ్రి ఖన్సిమ్ ఖాన్ నివాసం, వాంకిడి, ఆసిఫాబాద్ జిల్లా (పరారిలో వున్నాడు) రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ఎం .శ్రీనివాస్.ఐపీఎస్, టాస్క్ ఫోర్స్ సిఐ సంజయ్ ని, ఎస్సై ఉపేందర్ ను మరియు సిబ్బందిని అభినందించారు. అంతే కాకుండా ప్రతి ఇల్లీగల్ యాక్టివిటీ మీద, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారి పైన, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారి పైన టాస్క్ ఫోర్స్ పోలీసులు పూర్తి సమాచారం సేకరించి అణిచివేయడం జరుగుతుందనీ, అక్రమార్కుల మీద నిరంతరం నిఘా ఉంటుందని , వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ, గంజాయి రవాణా, నకిలీ పత్తి విత్తనాలు, జీరో వ్యాపారాలు, అక్రమ భూదందాలు భూకబ్జాలు, నకిలీ వ్యాపారాలు, జాబ్ ఫ్రాడింగ్ , ఇసుక, బొగ్గు, పిడియస్ రైస్ అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్ ,గేమింగ్ ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామనీ, ఇలాంటి వాటిపై సీపీ టాస్క్ ఫోర్స్ తో వరుస దాడులు నిర్వహించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ, సీపీ టాస్క్ ఫోర్స్ , ప్రజల సహకారంతో అధునాతన సాంకేతిక పద్ధతుల ద్వారా అక్రమార్కుల కదలికలను గుర్తించి అక్రమ వ్యాపారాలపై, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై వరుస దాడులు నిర్వహిస్తుందనీ సీపీ హెచ్చరించారు.

# నాణ్యతా ప్రమాణాల ప్రకారమే పనులు

- మండల పరిధిలోని ఊకచెట్టు వాగుపై రెండు చోట్ల నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులు నాణ్యత ప్రమాణాల ప్రకారమే జరుగుతున్నాయని పలువురు ఇంజనీర్ అధికారులు అభిప్రాయపడ్డారు
- నెల్లికొండి సమీపంలోని చెక్డ్యాం పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు
- చెక్డ్యాంల పనులను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



చిన్నచింతకుంట, మే 21 : మండల పరిధిలోని ఊకచెట్టు వాగుపై రెండు చోట్ల నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులు నాణ్యత ప్రమాణాల ప్రకారమే జరుగుతున్నాయని పలువురు ఇంజనీరు అధికారులు అభిప్రాయపడ్డారు. మండలంలోని నెల్లికొండి గ్రామ శివారులోని ఊకచెట్టువాగులో దాదావు రూ.15.29 కోట్లు, అలాగే వడ్డెమాన్ గ్రామ శివారులో దాదావు రూ.12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న చెక్డ్యాం పనులను మంగళవారం ఇరిగేషన్ ఎస్ఈ బీవీ రమణారెడ్డి, ఎస్ఈఈ ఎల్.చక్రధరం, ఈఈ ప్రతాప్సింగ్, డిప్యూటీ ఈఈ చందు, ఏఈ హరేశ్వర్రెడ్డి తదితర అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదావు రెండు శాతం పనులు పూర్తయినందున పనులను పరిశీలించేందుకు వచ్చినట్లు వారు తెలిపారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ డ్రాయింగ్ ప్రకారం సైట్ కండీషన్ తనిఖీల కోసం వచ్చినట్లు తెలిపారు. నాణ్యతాలోపం అంటూ వస్తున్న ఆరోపణలను వారు ఖండించారు. చెక్డ్యాంలు నాణ్యతగా నిర్మాణం ఉండాలన్నదే తమ అభిమతమని, సంబంధిత తమ అధికారులు కూడా ఎప్పటికప్పుడూ పనులను పరిశీలిస్తున్నారని, నాణ్యతాలోపం లేకుండా వారు చూస్తున్నారని తెలిపారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి దివంగత భారత ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణ నియమని టిపిసిసి కార్యదర్శి గాలి బాలాజీ అన్నారు. మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమం కె పి హెచ్ బి కాలనీ రాజీవ్ రోటరీ లో గల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద వారికీ పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను గుర్తు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి సి సి కార్యదర్శి గాలి బాలాజీ,114 డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్, గంధం రాజు, పి అర్ నాయుడు, పొడుగు అప్పారావు, మాఖ్దూమ్, బచ్చు మల్లి, రామారావు, రంగస్వామి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ త్యాగల కుటుంబం నుండి వచ్చి దేశం కోసం ప్రాణాత్యాగం చేసిన మహనీయుడు అని విజన్ 20 ద్వారా ఈ దేశాన్ని ఆధునిక టెక్నాలజీ రంగం వైపు నడిపించిన దర్శనికుడు,21సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

తూప్రాన్, మే 21: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని ఆర్కియాలజీశాఖ కమిషనర్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి పేర్కొన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం రవాణా చేసేందుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గుండ్రెడ్డిపల్లిలో ఐదులారీలు, మల్కాపూర్లో రెండు లారీలు అవసరమని చెప్పగా ఏర్పాటు చేసి ధాన్యం తరలించాలని సూచించారు. భారతిహోళికేరి వెంట అదరనె కలెక్టర్ వెంకటేశ్వర్లు, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం రుక్మిణీ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు మంగళవారం రోడ్డెక్కారు. తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ రోడ్డులో రవాణాశాఖ అధికారి శ్రీనివ్సారావు, తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో లారీలను సమకూర్చే పనులు చేపట్టారు. రోడ్డున వెళ్లే ఖాళీ లారీలను నిలిపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించారు. చేగుంట, మే 21: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ ఉన్న ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి అధికారులను ఆదేశించారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, కేంద్రాల వివరాలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని షేర్పల్లి, నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండా, జప్తి శివనూర్, సంకాపూర్, వల్లూరు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తరలించామని తెలిపారు. ఆరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వహణకురాలుగా పనిచేసిన సీసీ సుల్తానాను, అధికారుల పనితీరును ఆమె అభినందించారు. నార్సింగి కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు మాత్రమే ఉన్నాయని, వాటిని త్వరలో తరలించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

సూర్య
features@suryaa.com
కలర్స్
LIFE IS A RAINBOW
సూర్య
హైదరాబాద్
బుధవారం
22 మే 2024




# ఓ అధ్యక్షుడి మరణం

## ఎన్నో సమస్యలకు పరిష్కారం

- ప్రాచీన దేశం - మతాధికారుల వశం
- దేశ ఆదాయంతో ఆధునిక అణ్వాయుధాలు, అడ్డదారులు
- ప్రజాస్వామ్య ముసుగులో కరుడుకట్టిన మత దేశాధ్యక్షుడు ఇబ్రహీం రైసీ
- దేశ అధ్యక్షుడిగా రైసి రాక్షస క్రీడ
- హమాస్ హస్తానికి - రైసీ రొక్కం
- మరో మారు మాటువేసిన మొసాద్ ?

**బలవంతుడ నాకేమని / పలువురతో నిగ్రహించి పలుకుట మేలా? /బలవంతమైన సర్పము చలిచీమల చేతచిక్కి చావదే సుమతి! రాజు ఎంత పెద్దవాడైనను తను తీసుకునే నిర్ణయాలపైనే ఆ రాజ్యము మరియు ఆ రాజ్య ప్రజల భవిష్యత్తు ఆధారపడేది. కాలక్రమేణా రాజులు పోయారు రాజ్యాలు పోయాయి కానీ అదే రాచరికం కొత్తపుంతలు తొక్కుతూ ప్రజాస్వామ్య ముసుగులో రాజకీయ అవతారమెత్తింది. ప్రజాస్వామ్యం అనగా ప్రజలు చేత ఎన్నుకోబడే ప్రభుత్వాలు అన్నమాట. ప్రపంచంలో పెక్కుదేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలన చేస్తున్నారు. కానీ కొన్ని దేశాలు మాత్రం ప్రజాస్వామ్య ముసుగులో మతపరమైన కఠిన చట్టాలు మరియు మతాధికారుల పాలనలో ఉన్నాయి. ఈ పరిపాలనను వారు దైవపరిపాలన అంటారు. ఇందులో వాటికన్ సిటీ, సౌదీ అరేబియా (ఇది రాచరికం) మరియు ఇరాన్ (ఇది అధ్యక్ష మరియు మతాధికారుల ప్రజాస్వామ్యం) లు ఉన్నాయి. 550 బిసి లో పర్షియా సామ్రాజ్యం గా స్థాపించబడి, ఏడి 1501 సఫావిడ్ రాజవంశం క్రింద, 1794 కజర్ రాజవంశం కింద, 12 డిసెంబర్ 1925 ఇరాన్ పహ్లావి రాజవంశం కింద రూపాంతరం చెంది చివరిగా 1979 లో ఖమేని ఆధ్వర్యంలో ఇరానియన్ విప్లవం తో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఏర్పడిలది, దీనినే ఇరాన్ అని కూడా పిలుస్తారు. గతంలో పర్షియా అని పిలిచేవారు. దాదాపు పదివేల సంవత్సరాల నాటి సుదీర్ఘ చరిత్ర కలిగిన ఇరాన్ ప్రపంచంలోని అతి పురాతన దేశాలలో ఒకటి. ప్రాచీన కాలం నుండి చరిత్ర లో నిలిచిన ఈ దేశం ఆధునిక కాలంలో మాత్రం హింసాత్మక ఘటనలు చాలా చవిచూసుకున్నాయి. 1979 నుండి ఇరాన్ లో మతచట్టాలను అడ్డుపెట్టుకుని మానవ హక్కుల్ని మంటగలిపారు. ప్రపంచంలోనే ఎక్కువ ఉరి శిక్షలు అమలుపరిచే దేశం గా కూడా రికార్డుల్లోకెక్కింది. శాశ్వత సుప్రీమ్ లీడర్ (జీవిత కాలం) మరియు ప్రజల చేత ఎన్నుకోబడ్డ (4 సం?? కాలం) అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం నడుస్తుంది. ఇక న్యాయ వ్యవస్థ అంతా ఇస్లాం షరియా చట్టం ఆధారంగా నడుస్తుంది. 1979 నుండి ఇద్దరు మాత్రమే శాశ్వత సుప్రీం లీడర్ గాను, 13 మంది అధ్యక్షులు గా 42 సంవత్సరాలు పరిపాలించి అనేక రక్తపు మరకలు అంటించుకున్నారు.**

ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ ఉత్పత్తిలో ముందున్న ఇరాన్ తన సొంత మిలిటరీ (%×=+జ%) మరియు గూఢచారార సంస్థ (%ుఖీ%) లను ఉపయోగించి ఉగ్రవాద కార్యకలాపాలను 1979 నుండి ప్రపంచవ్యాప్తంగా 35 పైగా దేశాల్లో కుట్రలు, హత్యలు మరియు బాంబ్ దాడులను తన ప్రధాన భాగస్వామి లెబనీస్ హిజ్బుల్లా ద్వారా చేయిస్తుంది. 13, ఫిబ్రవరి, 2012 న న్యూఢిల్లీ లో ఇరాన్ ప్రభుత్వ సంస్థలు %×=+జ-ుఖీ% ఇజ్రాయెల్ దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని బాంబ్ దాడి చేశారు, ఈ దాడిలో ఒక ఇజ్రాయెలీ మరియు ముగ్గురు భారతీయ పౌరులు గాయపడ్డారు. వందల కొద్దీ ఉగ్రవాద సంస్థలకు కోట్ల డబ్బు, ఆయుధాలు అందిస్తుంది ఇరాన్ ప్రభుత్వం. దానికి తోడు అంతర్గత హింసకు అమాయకులు బలైపోతున్నారు.

జూన్ 2021 అధ్యక్ష ఎన్నికల్లో రైసీ 18 మిలియన్లకు పైగా అక్రమ బెదిరింపు ఓట్లను సాధించి ఆ దేశ సుప్రీం లీడర్ అండదండలతో ఇరాన్ 13వ అధ్యక్షుడయ్యారు. రైసి 1960లో మషాద్లో జన్మిచారు. కేవలం ప్రాథమిక విద్యను మాత్రమే అభ్యసించిన ఆయన తరవాత షరీయా చట్టాన్ని పఠించి సుప్రీమ్ లీడర్ ఆశీర్వాదంతో అతను కరాజ్ జిల్లా అటార్నీగా, డిప్యూటీ ప్రాసిక్యూటర్ గా, డిప్యూటీగా పనిచేశారు. జనరల్ ఇన్స్పెక్షన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇరాన్ అధిపతిగా, న్యాయవ్యవస్థ యొక్క మొదటి డిప్యూటీగా, ఇరాన్ అటార్నీ జనరల్గా కూడా పనిచేశాడు.

మార్చి 2016లో రైసీని అస్తాన్ ఖుద్స్ రజావి సంరక్షకుడిగా నియమించారు. మార్చి 7, 2019న, ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ఆదేశాల మేరకు రైసీ న్యాయవ్యవస్థ అధిపతి అయ్యి 2021 లో దేశ అధ్యక్షుడు అయ్యారు.

1988లో టెహ్రాన్ సమీపంలోని ఎవిన్ మరియు గోహర్దష్ట్ జైళ్లలో ఉన్న (30,000) వేల మంది రాజకీయ అసమ్మతివాదులను రహస్యంగా, చట్టవిరుద్ధంగా ఉరితీసిన 'డెత్ కమిషన్'లో ఇబ్రహీం రైసీ ముఖ్య సభ్యుడు. 2021లో రైసీ అధ్యక్ష పదవిని చేపట్టిన వెంటనే ఇరాన్ ప్రజల అణచివేత విధానాలు తీవ్రమయ్యాయి. ఉరిశిక్షల అమలు భయంకరంగా పెరిగాయి. రాజకీయ నాయకులపై అణచివేత విస్తారంగా వ్యాపించింది. 2022లోనే 22 మంది మహిళలు, ఎనిమిది మంది బాలబాలికలు సహా 582 మందికి మరణశిక్ష విధించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఇది 2021 వ సంవత్సరం కన్నా ఎక్కువ.

రైసీ ఇరాన్లో కఠినమైన నియంత్రణను ఏకీకృతం చేయడానికి అడుగులు వేశారు. సుప్రీం లీడర్ నుండి పార్లమెంటు, ఆర్మీ , నిఘా వరకు రైసి హస్తగతం చేసుకున్నారు. ఈ విధానంతో ఇరాన్లోని సంస్కరణవాదులు మరియు మితవాదుల భవిష్యత్తు అగమ్యగోచరం అయింది. రైసీ పాలన పూర్తిగా క్రూరత్వం దిశలో పయనిస్తోంది. అందుకు ఉదాహరణ ఇరాన్ క్రూరమైన హిజాబ్ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన మహసా అమిని అనే మహిళ పోలీసు కస్టడీలో మరణించిన తర్వాత ఇది స్పష్టంగా కనిపించింది. అమిని మరణాన్ని నిరసిస్తూ వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. అప్పుడు రైసీ అణచివేత ప్రపంచానికి తెలిసింది.

ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేకుల హత్యలు, జైలు శిక్ష, బలవంతపు అదృశ్యం, హింస, అత్యాచారం, లైంగిక హింస వంటి నేరాలను ప్రోత్సహించడం. సిరియాలో సాయుధ పోరాటంలో ప్రభుత్వ బలగాలకు ఇరాన్ సైనిక సహాయాన్ని అందించడం, ఇరాన్ రష్యాకు డ్రోన్లను అందించడం, ఇజ్రాయెల్పై హమాస్ మరియు ఇతర పాలస్తీనా సాయుధ గ్రూపులు జరిపిన దాడిలో ప్రమేయం, భావవ్యక్తీకరణ, స్వేచ్ఛ నియంత్రణ, నిరసనల సమయంలో ఇంటర్నెట్ మరియు మొబైల్ ఫోన్ నెట్వర్క్లకు అంతరాయం. మీడియా, శాటిలైట్ టెలివిజన్ ఛానెల్లను సెన్సార్, యూట్యూబ్ సహా మొబైల్ యాప్లు మరియు సోషల్ మీడియా ప్లాట్ఫారమ్లను బ్లాక్ చేయడం. దేశవ్యాప్తంగా సామూహిక నిరసనలను నివారించడం. ఏకపక్ష నిర్బంధం, అన్యాయమైన ప్రాసిక్యూషన్, విద్య లేదా ఉద్యోగాల నుండి సస్పెన్షన్ లేదా బహిష్కరణకు గురవ్వటం. నిరసనకారులు, మహిళలు, పాత్రికేయులు, నటులు, సంగీతకారులు, రచయితలు, విద్యావేత్తలు, విశ్వవిద్యాలయ విద్యార్థులు, మానవ హక్కుల రక్షకులు, మహిళా హక్కుల కార్యకర్తలు, మరణశిక్ష వ్యతిరేక ప్రచారకులు, న్యాయవాదులు అక్రమ హత్యలకు గురవుతున్నారు. ఆర్థిక అవినీతి, మొహరేబెహ్, ఎఫ్సాద్-ఇ ఫెల్-అర్జ్ వంటి అస్పష్టమైన పదాలతో కూడిన నేరాలు ఉన్నాయి. అలానే ప్రవక్తను అవమానించడం, మద్యం సేవించడం, పెద్దల ప్రమేయంలేని వివాహాలు, స్వలింగ, లైంగిక సంబంధాల గోప్యత, మతం లేదా విశ్వాసం కొరవడినా ఈ చర్యలకు మరణశిక్ష కొనసాగించబడింది. వ్యభిచారంతో పట్టుబడితే రాళ్లతో కొట్టే శిక్ష విధిస్తారు.

1979లో ఇరాన్ విప్లవం తర్వాత ఇరాన్, ఇజ్రాయెల్ సంబంధాలు ఆటంకం కలిగాయి, 1982 లెబనాన్ యుద్ధంలో ఇరాన్ లెబనీస్ షియా, పాలస్తీనియన్ మిలిటెంట్లకు మద్దతు ఇచ్చి ఇజ్రాయెల్ పై యుద్ధం చేసి ఓడిపోయింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఆపడానికి ఇజ్రాయెల్ చేసిన ప్రయత్నాలు సఫలమవ్వటంతో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తారాస్థాయి కి చేరింది.

ఇజ్రాయెల్ కి నలువైపులా దాడులకు నాంది ఇరాన్ దేశం అని గుర్తించి అనేకమారులు దాడులు జరిపిన నేపధ్యంలో బుద్ధి మార్చని ఇరాన్ ని నిలువరించటానికి మొసద్ ప్రమేయమేనని ప్రపంచం కోడైకూస్తోంది. ఒక దేశ అధ్యక్షుడు ని నిలువరించటం అంటే మాములు విషయం కాదు. ఆయన ప్రయాణించిన బెల్ 212 అమెరికా రకానికి చెందిన హెలికాప్టర్పై అత్యాధునికమైన స్పేస్ లేజర్ వెపన్తో దాడి జరిగి ఉండొచ్చనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమౌతోన్నాయి.?? అలాంటి అంతుచిక్కని మిస్టరీ లా ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. కొందరి మేధావుల విశ్లేషణలో మొసాద్ ఏజెంట్ అధ్యక్షుడి హెలికాప్టర్ పైలట్ గా వ్యవహరించారని? నానుడి. అందుకు అనుమానం ఏమంటే అధ్యక్షుడు హెలికాప్టర్ తోపాటు ఎస్కార్ట్ హెలికాప్టర్ లు 2 సురక్షితంగా ల్యాండ్ అయ్యి, అధ్యక్షుడు హెలికాప్టర్ ల్యాండ్ అవ్వకపోవటం ప్రధాన కారణం?? మరో పక్క రైసీ ప్రజా వ్యతిరేక విధానాలకు దేశ అంతర్గత ముఖ్య నాయకుల వ్యతిరేక ముప్పు వున్నదని, భవిష్యతు ఇరాన్ సుప్రీం లీడర్ కూడా ఇబ్రహీం రైసీ (ప్రస్తుత సుప్రీం లీడర్ కుమారుడు కాకుండా) అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని రైసీ పోకడలు గిట్టని ప్రభుత్వ పెద్దల చర్యలుగా అనుమానం?..





### అత్యాశ అత్యంత ప్రమాదం

ఇబ్రహీం రైసీ బలహీనమైన నిర్ణయాలు, తప్పుడు ప్రసంగాలు, వారసత్వం కోసం (సుప్రీం లీడర్ కోసం) నియంతృత్వ పోకడలు, అధికార దుర్వినియోగం, ఆర్థిక వ్యవస్థ అవినీతిమయం వలన మూడేళ్లలో ఆర్థిక గణాంకాలు చాలా కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. దేశ వ్యాప్తంగా తీవ్రమైన నిరసనలు, సమ్మెలు, ప్రధానంగా 2022 విప్లవాత్మక తిరుగుబాటు రైసీ పదవీకాలంలో సంభవించింది. మే 19, 2024 న, 63 సంవత్సరాల వయస్సులో, ఇబ్రహీం రైసీ "సుప్రీం లీడర్" కావాలనే తన అంతిమ కలను సాకారం చేసుకోకుండానే మరణించాడు.

ఆ మరణం పట్ల ఆ దేశ వ్యాప్తంగా ప్రజలు చాలా సంతోషం వ్యక్తపరుస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు...ఇది దేనికి నాంది???

**న శరీరమాలత్యాగాత్, నరోభవతి నిర్మలహా**
**మానసేతు మలే త్యక్తే, తతో భవతి నిర్మలహా**
**శారీరక మలినములను తొలగించుకోవడం వల్లనే**
మనుషులు నిర్మలురు కారు. మనో మాలిన్యములను తొలగించకొన్నప్పుడే నిర్మలురు అవుతారు

**నూతలపాటి రవికాంత్**
**9704444108**



## వైఎస్ ప్రమాదం ఈ తీరుగానే

009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ లో హైద్రాబాద్ బేగంపేట విమానాశ్రయం నుండి చిత్తూరు జిల్లాకు బయలుదేరారు. బేగంపేట విమానాశ్రయం నుండి బయలుదేరిన కొద్దిసేపటికే రాజశేఖర్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఏటీసీతో సంబంధాలు కోల్పోయింది. సీఎం ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మిస్సింగ్ కావడంతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. రక్షణ శాఖకు చెందిన ఆధునాతన విమానాలు, హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. నల్లమల అడవుల్లోని పావురాలగుట్ట వద్ద వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రయాణించిన హెలికాప్టర్ శకలాలను గుర్తించారు. ఈ ప్రమాదంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సహా వ్యక్తిగత సిబ్బంది మృత్యువాతపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఇబ్రహీం రైసీ ఉపయోగించింది బెల్ హెలికాప్టర్లే మే 19వ తేదీన ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ఇరాన్-అజర్ బైజాన్ సరిహద్దు నుండి తబ్రిజ్ పట్టణానికి బెల్ 212 హెలికాప్టర్ లో బయలుదేరారు. రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణం కారణంగా కుప్పకూలింది. టేకాఫ్ అయిన 30 నిమిషాలకే ఈ హెలికాప్టర్ కు ఏటీసీతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో అధికారులు అధ్యక్షుడి హెలికాప్టర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.





# అందుకే మార్పులు చేయలేదు: కమిన్స్

ఐపీఎల్ 2024 సీజన్లో భాగంగా కోల్కతా నైట్రైడర్స్(కేకేఆర్)తో జరుగుతున్న కీలక క్వాలిఫయర్-1 మ్యాచ్లో సన్రైజర్స్ హైదరాబాద్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. పిచ్ బ్యాటింగ్కు అనుకూలంగా ఉంటుందనే ఈ నిర్ణయం తీసుకున్నానని సన్రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తెలిపాడు. 'మేం ముందుగా బ్యాటింగ్ చేస్తాం. పిచ్ బ్యాటింగ్కు అనుకూలంగా కనిపిస్తోంది. ఇది హైస్కోరింగ్ గేమ్ అనుకుంటున్నాం. ఈ సీజన్లో మా బ్యాటింగ్ విభాగం సంచలన ప్రదర్శనలు కనబర్చింది. అదే జోరును ఈ రోజు కూడా కొనసాగిస్తారని భావిస్తున్నా.
మేం ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్నే కొనసాగిస్తున్నాం.'అని ప్యాట్ కమిన్స్ తెలిపాడు. మరోవైపు టాస్ గెలిచినా తాము ముందుగా బౌలింగ్ చేసేవాళ్లమని కేకేఆర్ సారథి శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. పిచ్ క్యూరేటర్తో మాట్లాడినప్పుడు ఇది మిక్స్ సాయిల్ అని చెప్పాడు. పిచ్ ఎలా స్పందిస్తుందో చూడాలి. ఇది మంచి మ్యాచ్ అవుతుందని ఆశిస్తున్నా. మా మూమెంటమ్ను కొనసాగించడం చాలా ముఖ్యం. గతం, భవిష్యత్తు గురించి ఆలోచించకుండా ప్రస్తుత మ్యాచ్పై మాత్రమే ఫోకస్ పెట్టడం కీలకం.
టేబుల్ టాపర్గా నిలవడం గొప్ప ఘనత. జట్టులోని ప్రతీ ఒక్కరు గర్వపడుతున్నారు. మేం ఎలాంటి మార్పులు లేకుండా సేమ్ టీమ్తో బరిలోకి దిగుతున్నాం.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్ చేరనుండగా.. ఓడిన జట్టు క్వాలిఫయర్-2 మ్యాచ్ ఆడనుంది. ఈ క్రమంలోనే ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి.



## విజేతగా నిలిచేది
# ఆర్సీబీ జట్టే

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో కీలక సమరానికి సిద్ధమైంది. అహ్మదాబాద్ వేదికగా ఎలిమినేటర్ మ్యాచ్లో బుధవారం రాజస్థాన్ రాయల్స్తో తలపడనుంది. క్వాలిఫయర్-2కు చేరుకోవాలంటే రేపటి మ్యాచ్లో తప్పక విజయం సాధించాలి. రెండు వారాల క్రితం పాయింట్ల పట్టికలో అట్టడుగన నిలిచిన ఆర్సీబీ, ఆ తర్వాత వరుసగా ఆరు విజయాలు సాధించి ప్లేఆఫ్స్కు అర్హత సాధించింది. అదే జోరులో రేపటి మ్యాచ్లోనూ రాజస్థాన్ రాయల్స్ను నెగ్గి క్వాలిఫయర్-2కు చేరుకోవాలని ఆర్సీబీ కసిగా బరిలోకి దిగుతోంది. మరోవైపు రాజస్థాన్ గత నాలుగు మ్యాచ్లోనూ ఓటమిచవిచూసింది. ఈ నెలలో జరిగిన అయిదు మ్యాచ్లో ఒక్క విజయం కూడా సాధించలేకపోవడం రాజస్థాన్ను కలవరపెడుతోంది. అయితే ఆర్ఆర్ను తక్కువగా అంచనా వేయలేని పరిస్థితి. రాజస్థాన్కు బ్యాటింగ్తో పాటు బౌలింగ్ లైనప్ ఉంది. దీంతో రేపటి పోరు హోరాహోరీగా సాగడం ఖాయంగా అనిపిస్తోంది. అయితే ఎలిమినేటర్ మ్యాచ్లో రాజస్థాన్ రాయల్స్ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధిస్తుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు జోస్యం చెప్పాడు. క్వాలిఫయర్-2కి ఆర్సీబీ తప్పక దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశాడు. స్టార్ స్పోర్ట్స్లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాయుడు ఈ వ్యాఖ్యలు చేశాడు. "ఆర్సీబీ విజయం సాధిస్తుందని నేను భావిస్తున్నాను. ఎందుకంటే వాళ్లు ఆడుతున్న విధానం గొప్పగా ఉంది. సీఎస్కేపై గెలిచిన తీరు ఎంతో బాగుంది.

మరోవైపు రాజస్థాన్ రాయల్స్కు గత మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఇది ఆ జట్టుకు సానుకూలంగా మారుతుందా ప్రతికూలంగా అవుతుందో తెలియదు. అయితే ఆర్సీబీ జట్టులో ప్రతి ఆటగాడికి తన పాత్రపై స్పష్టత ఉంది. కాబట్టి క్వాలిఫయర్స్-2కు ఆర్సీబీ వెళ్తుందనుకుంటున్నా" అని రాయుడు అన్నాడు. రాయుడు వ్యాఖ్యలతో ఆర్సీబీ మాజీ పేసర్ వరుణ్ ఆరోన్ ఏకీభవించాడు. బెంగళూరు జట్టు క్వాలిఫయర్-2కు వెళ్తుందని, ఆ తర్వాత ట్రోఫీని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆర్సీబీ కోసం విరాట్ కోహ్లి ప్రారంభం నుంచి ఎంతో శ్రమిస్తున్నాడని, సర్వశక్తులతో పోరాడుతున్నాడని అన్నాడు. ఐపీఎల్లో ఎన్నో ఘనతలు సాధించిన కోహ్లికి ట్రోఫీ అందుకోవడం ఒక్కటే మిగిలుందని, అది ఈ సీజన్లో సంపూర్ణమవుతుందని ఆరోన్ పేర్కొన్నాడు.

# రాజస్థాన్కు బట్లర్ దూరం

## ఆర్సీబీతో తలపడే రాజస్థాన్ తుది జట్టు ఇదే





ఐపీఎల్ 2024 సీజన్లో రాజస్థాన్ రాయల్స్ కీలక పోరుకు సిద్ధమైంది. అహ్మదాబాద్ వేదికగా బుధవారం జరగనున్న ఎలిమినేటర్ మ్యాచ్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్లో విజయం సాధించి టైటిల్ రేసులో నిలవాలనే పట్టుదలతో ఉంది. వర్షం కారణంగా టాప్-2లో నిలిచే అవకాశాన్ని తృాఎటిలో చేజార్చుకున్న రాజస్థాన్ రాయల్స్.. ఆర్సీబీని ఓడించి క్వాలిఫయర్-2 మ్యాచ్కు అర్హత సాధించాలని భావిస్తోంది. టోర్నీ ఆరంభంలో అసాధారణ ప్రదర్శన కనబర్చిన రాజస్థాన్ రాయల్స్.. చివరి ఐదు మ్యాచ్లో మాత్రం వరుసగా నాలుగింటిలో ఓడిపోయింది. కేకేఆర్తో జరగాల్సిన చివరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. మరోవైపు ఆర్సీబీ సంచలన విజయాలతో ప్లే ఆఫ్స్కు దూసుకొచ్చింది. వరుసగా 6 మ్యాచ్లో గెలుపొందడమే కాకుండా పటిష్ట చెన్నైని మట్టికరిపించింది.

ప్రస్తుతం ఆర్సీబీ రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఆ జట్టును ఓడించాలంటే రాజస్థాన్ రాయల్స్ అసాధారణ ప్రదర్శన కనబర్చాల్సిందే. పాకిస్థాన్తో సిరీస్ నేపథ్యంలో ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ దూరమవ్వడం కూడా రాజస్థాన్ రాయల్స్కు బలహీనతగా మారింది. అయితే స్పిన్కు అనుకూలంగా ఉంటే అహ్మదాబాద్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుండటం రాజస్థాన్కు కలిసొచ్చే అంశం. తుది జట్టులో పెద్దగా మార్పులు చేసే అవకాశం లేదు. జోస్ బట్లర్ స్థానంలో ఇంగ్లండ్కే చెందిన టామ్ కోహ్లర్ బరిలోకి దిగనున్నాడు. అతనితో పాటు ట్రెంట్ బౌల్ట్, షిమ్రన్ హెట్మైర్, రోవ్మన్ పోవెల్ విదేశీ ఆటగాళ్లుగా ఆడనున్నారు. జోస్ బట్లర్ దూరమైనా.. సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్, రియాన్ పరాగ్ సూపర్ ఫామ్లో ఉన్నారు. కీలక మ్యాచ్లో వీరు సత్తా చాటితే రాజస్థాన్ రాయల్స్కు తిరుగుండదు. బౌలింగ్లో అశ్విన్, చాహల్, బౌల్ట్ నిప్పులు చెరుగుతున్నారు. ఈ సీజన్లో ఆర్సీబీతో ఒకే ఒక మ్యాచ్ ఆడిన రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో సునాయస విజయాన్నందుకుంది.

రాజస్థాన్ రాయల్స్ తుది జట్టు(అంచనా):
యశస్వి జైస్వాల్, టామ్ కోహ్లర్, సంజూ శాంసన్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, రోవ్మన్ పోవెల్, షిమ్రన్ హెట్మైర్, రవిచంద్రన్ అశ్విన్, ట్రెంట్ బౌల్ట్, సందీప్ శర్మ, ఆవేశ్ ఖాన్

# నాకు క్రికెట్ ఎంతో ఇచ్చింది

- ఎంతోకొంత తిరిగి ఇవ్వాలి
- టీమిండియా కోచ్ పదవిపై భజ్జీ
- టీ20 ప్రపంచకప్ 2024తో ముగుస్తున్న ప్రస్తుత కోచ్ ద్రావిడ్ పదవీకాలం
- ఈ నేపథ్యంలోనే ఇటీవల హెడ్ కోచ్ పోస్టుకు బీసీసీఐ దరఖాస్తులకు ఆహ్వానం
- మెన్ ఇన్ బ్లూకు కోచింగ్ ఇచ్చే అవకాశం వస్తే సంతోషిస్తానంటున్న హర్భజన్



భవిష్యత్తులో టీమిండియా క్రికెట్ కోచ్గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని మాజీ క్రికెటర్, స్టార్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ హింట్ ఇచ్చారు. ఒకవేళ తనకు 'మెన్ ఇన్ బ్లూ'కు కోచింగ్ ఇచ్చే అవకాశం వస్తే.. తనకు ఎంతో ఇచ్చిన క్రికెట్కు, ఎంతోకొంత తిరిగి ఇచ్చే అవకాశం దొరుకుతుందన్నారు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పురుషుల జాతీయ జట్టు ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తులను ఆహ్వానించిన వారం తర్వాత హర్భజన్ ప్రకటన రావడం గమనార్హం. ఇక ప్రస్తుతం టీమిండియా కోచ్గా ఉన్న రాహుల్ ద్రావిడ్ పదవీకాలం 2024 టీ20 వరల్డ్కప్తో ముగుస్తుంది. అంటే జూన్ చివరి నాటికి ద్రావిడ్ కోచ్గా వైదొలుగుతారు. అందుకే కొత్త కోచ్ కోసం బీసీసీఐ తాజాగా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తుకు ఆఖరి గడువు మే 27 సాయంత్రం 6 గంటల వరకు ఉంది. కాగా, కొత్త కోచ్ పదవీ కాలం ఈ ఏడాది జులై 1 నుండి ప్రారంభమై 2027 డిసెంబర్ 31తో ముగుస్తుందని బీసీసీఐ తన ప్రకటనలో పేర్కొంది. అంటే టీమిండియాకు- కొత్తగా కోచ్ పదవికి ఎంపికయిన వ్యక్తి 2027 వన్డే ప్రపంచకప్ వరకు భారత జట్టుకు ప్రధాన కోచ్గా కొనసాగుతాడు.

# ఎస్ఆర్హెచ్కు గుడ్ న్యూస్, కేకేఆర్కు బ్యాడ్ న్యూస్



ఐపీఎల్-2024లో లీగ్ మ్యాచ్లు ముగిశాయి. ఇక క్లైమాక్స్ ఫైట్ మొదలుకానుంది. ప్లేఆఫ్స్కు చేరిన జట్లు క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్లో తలపడనున్నాయి. టాప్-2లో నిలిచిన కోల్కతా నైట్ రైడర్స్, సన్రైజర్స్ హైదరాబాద్ ఇవాళ క్వాలిఫయర్-1లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ పోరులో గెలిచిన టీమ్ నేరుగా ఫైనల్కు చేరుతుంది. ఓడిన జట్టు రేపు జరగనున్న ఎలిమేనటర్ మ్యాచ్ విజేతతో కలిసి క్వాలిఫయర్-2లో పోటీపడాల్సి ఉంటుంది. అయితే అహ్మదాబాద్ వేదికగా ఇవాళ జరగనున్న క్వాలిఫయర్-1లో కేకేఆర్, ఎస్ఆర్హెచ్ జట్లు ఫేవరేట్గానే బరిలోకి దిగుతున్నాయి. ఇరు జట్లు సూపర్ ఫామ్లో ఉన్నాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పటిష్టంగా ఉన్నాయి.

దీంతో ఇవాళ హోరాహోరీ పోరు సాగడం ఖాయంగా అనిపిస్తోంది. అయితే రికార్డుల పరంగా చూస్తే సన్రైజర్స్పై కోల్కతాదే పైచేయి. ఇప్పటివరకు ఇరు జట్లు 26 మ్యాచ్లో తలపడగా కేకేఆర్ 17 సార్లు, ఎస్ఆర్హెచ్ తొమ్మిది సార్లు గెలిచాయి. దీంతో ఆరెంజ్ ఆర్మీలో కాస్త టెన్షన్ మొదలైంది. అంతేగాక రిజర్వ్ డే రూల్ కూడా సన్రైజర్స్ అభిమానులను కలవరపెడుతోంది. ఇవాళ జరగనున్న మ్యాచ్ రద్దయితే, రిజర్వ్ డే రోజున మ్యాచ్ నిర్వహిస్తారు. ఒకవేళ వర్షం కారణంగా రిజర్వ్ డే రోజు కూడా మ్యాచ్ జరగకపోతే టేబుల్ టాపర్ అయిన కేకేఆర్ను విజేతగా ప్రకటించి ఫైనల్కు క్వాలిఫై చేస్తారు. కానీ, కొన్ని విషయాలు ఆరెంజ్ ఆర్మీని సంతోషంలో ముంచెత్తుతున్నాయి. ఇవాళ వర్షం ముప్పు లేదు. అంటే మ్యాచ్ సజావుగా సాగడం ఖాయమే. మరోవైపు మ్యాచ్ వేదిక అయిన అహ్మదాబాద్లో కేకేఆర్ స్టార్ ప్లేయర్లకు చెత్త రికార్డు ఉంది. కోల్కతా జట్టులో సునీల్ నరైన్ చాలా ప్రమాదకరమైన ప్లేయర్. స్పిన్నర్గా ప్రత్యర్థిని భయపెట్టే నరైన్.. ఈ సీజన్లో బ్యాటర్గా మరింత సత్తాచాటుతున్నాడు. అయితే అహ్మదాబాద్లో మూడు మ్యాచ్లు ఆడిన నరైన్ మూడు సార్లు డకౌటవ్వడం గమనార్హం. అంతేగాక అహ్మదాబాద్లో రసెల్ రికార్డు కూడా పేలవంగా ఉంది. ఇక్కడ అతని స్ట్రైక్రేటు 140 మాత్రమే. ఈ మైదానంలో బౌండరీలు దూరంగా ఉంటాయి. దీన్ని ఎస్ఆర్హెచ్ బౌలర్లు సద్వినియోగం చేసుకుని రసెల్ వికెట్ను సులువుగా సాధించవచ్చు. బంతితోనూ రసెల్ సత్తాచాటలేకపోయాడు. నాలుగు మ్యాచ్లో ఇక్కడ ఒక్క వికెట్ సాధించలేపోయాడు. మరోవైపు ఈ పిచ్పై భువనేశ్వర్కు మెరుగైన రికార్డు ఉంది. మూడు మ్యాచ్లు ఆడిన భువీ ఏకంగా తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. కనీసం బంతికో పరుగు కూడా ఇవ్వలేదు.



## భారత జట్టులో ఆడేందుకు
# ఐపీఎల్ షార్ట్కట్ కాదు

- ఐపీఎల్, భారత క్రికెట్, కాంట్రవర్సీలపై గౌతీ ఆసక్తికర వ్యాఖ్యలు
- ఐపీఎల్ వల్ల భారత దేశవాళీ క్రికెటర్లకు మేలు జరిగిందన్న గంభీర్
- అంతర్జాతీయ టీ20 క్రికెట్లో టీమిండియా దుర్భేద్యమైన జట్టని వ్యాఖ్య
- తాను ఎందుకు సీరియస్గా ఉంటాడో చెప్పిన భారత మాజీ క్రికెటర్

భారత మాజీ క్రికెటర్ గౌతం గంభీర్ తాజాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల స్టార్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కు సంబంధించిన యూట్యూబ్ ఛానెల్కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐపీఎల్, భారత క్రికెట్, కాంట్రవర్సీలపై గౌతీ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. ఐపీఎల్ వల్ల భారత దేశవాళీ క్రికెటర్లకు మేలు జరిగింది. ప్రస్తుతం అంతర్జాతీయ టీ20 జట్లను చూసినప్పుడు 2-3 జట్లను మినహాయిస్తే టీమిండియాతో పోటీపడే టీమ్లు కనిపించడం లేదు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ కంటే ఐపీఎల్లో పోటీ పెరిగింది. అయితే, దీనివల్ల దేశవాళీ క్రికెటర్ల నాణ్యత మారిపోయింది. అందరూ ఐపీఎల్ ఆడాలని కోరుకుంటున్నారు. దాంతో ఆటోమేటిక్గా టీ20కి తగినట్లు తమను తాము సిద్ధం చేసుకుంటున్నారు. వారి దృష్టంతా టీ20 క్రికెట్ ఆడటంపైనే కేంద్రీకృతమై ఉంటోంది. ఇప్పుడున్న అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే, టీమిండియా తరఫున ఎంత మంది యువ ఆటగాళ్లు టెస్ట్ క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారని. భారత జాతీయ జట్టుకు ఎంపిక కావడానికి ఐపీఎల్ అనేది షార్ట్కట్ కాకూడదని కోరుకుంటున్నాను. వన్డే, టెస్ట్ జట్లకు ఎంపిక కావాలంటే దేశవాళీ క్రికెట్లో రాణించాల్సిందే అని గంభీర్ తెలిపాడు.

అభిమానులు వచ్చేది నా జట్టు విజయం కోసం.. నా నవ్వు కోసం కాదు.. ఇక ఇదే చిట్చాట్ సెషన్లో గంభీర్ తాను ఎందుకు సీరియస్ గా ఉంటాడో కూడా వెల్లడించాడు. చాలా మంది నన్ను ఎప్పుడూ నవ్వడని, దూకుడుగా ప్రవర్తిస్తానని, కోపంగా ఉంటానని అంటుంటారు. అభిమానులు నా నవ్వు చూడడానికి స్టేడియంకి రారు. నేను మ్యాచ్ గెలవడాన్ని చూడటానికి వస్తారు. అలాంటి ప్రొఫెషన్లో ఉన్నాం. మేము ఎంటర్టైన్మెంట్లో లేము. లేదా కార్పొరేట్స్ కాదు. నేను బాలీవుడ్ యాక్టర్ని కాదు. నేను క్రికెటర్ని. నేను కచ్చితంగా మ్యాచ్ గెలిచి, డ్రెస్సింగ్ రూమ్కి తిరిగి రావాలనుకుంటాను. ఏదేమైనా విజయం సాధించినప్పుడే డ్రెస్సింగ్ రూమ్ హ్యాపీగా ఉంటుంది. నేను ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించడం లేదు కదా. నేను ఎంత దూకుడుగా ఉంటానో అంతే దూకుడుగా ఉండాలనుకుంటున్నాను. అందులో తప్పేముంది? అది నా స్వభావం. ఎందుకంటే నాకు మ్యాచ్ గెలవడమనేది కీలకం. అదే నాకు ఉన్న సమస్య అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

ఇక గౌతం గంభీర్ భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయమైన విజయాలు అందించాడు. అందులో 2011లో ఎంఎస్ ధోనీతో కలిసి వన్డే ప్రపంచకప్ గెలవడం ఒకటి. ఈ మ్యాచ్లో గౌతీ ఆడిన 97 పరుగుల కీలకమైన ఇన్నింగ్స్ను టీమిండియా అభిమానులు ఎవరూ అంత త్వరగా మరిచిపోలేరు. అటు ఐపీఎల్లో కూడా గౌతీ తనకంటూ గుర్తింపు పొందాడు. 2012, 2014లో కోల్కతా నైట్రైడర్స్ (కేకేఆర్) కు రెండుసార్లు ఐపీఎల్ టైటిల్స్ అందించాడు. ప్రస్తుత సీజన్లో కేకేఆర్ జట్టు మెంటార్గా తిరిగి బాధ్యతలు చేపట్టాడు. దీంతో ఈసారి ఆ జట్టు టేబుల్ టాపర్గా నిలిచింది.

## టీమిండియా కోచ్ పదవి
# ధోనీపై బీసీసీఐ ఒత్తిడి



భారత జట్టు ప్రధాన కోచ్ పదవిపై ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి మరికొన్ని రోజులు మాత్రమే అవకాశం ఉంది. మే 27, సాయంత్ర 6 గంటలతో కోచ్ పదవికి అప్లై చేసే గడువు ముగుస్తుంది. రాహుల్ ద్రవిడ్ స్థానంలో సమర్థవంతమైన వ్యక్తికి టీమిండియా కోచ్ బాధ్యతలను అందివ్వాలని బీసీసీఐ భావిస్తుంది. కోచ్ పదవి రేసులో కొందరు మాజీ క్రికెటర్ల పేర్లు గత కొన్నిరోజులుగా వినిపిస్తున్నాయి. గౌతమ్ గంభీర్, వీవీఎస్ లక్ష్మణ్, ఆశిష్ నెహ్రాతో పాటు విదేశీ క్రికెటర్లు రికీ పాంటింగ్, స్టీఫెన్ ఫ్లెమింగ్ టీమిండియా కోచ్ బాధ్యతలు అందుకోవడానికి గట్టి పోటీలో ఉన్నారని ప్రచారం జోరుగా సాగుతోంది. కాగా, ప్రస్తుత చెన్నై సూపర్ కింగ్స్ కోచ్, న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ స్టీఫెన్ ఫ్లెమింగ్పై బీసీసీఐ ఆసక్తిగా ఉందని తెలుస్తుంది. సీఎస్కేను అయిదు సార్లు ఛాంపియన్గా నిలపడంతో ధోనీతో పాటు ఫ్లెమింగ్ది కీలకపాత్ర. అయితే టీమిండియా కోచ్ పదవికి ఫ్లెమింగ్ ఇంకా దరఖాస్తు చేసుకోలేదని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఒత్తిడి ఉండే భారత జట్టు ప్రధాన కోచ్ పదవిని అందుకోవడానికి ఫ్లెమింగ్ సుముఖంగా లేడని తెలుస్తోంది. కానీ ఫ్లెమింగ్ను కోచ్గా నియమించాలని బీసీసీఐ పట్టుదలతో ఉన్నట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో ఫ్లెమింగ్ను ఒప్పించడం కోసం ఎంఎస్ ధోనీని రంగంలోకి దించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఐపీఎల్ ప్రారంభం నుంచి ఫ్లెమింగ్తో ధోనీ స్నేహబంధం కొనసాగుతోంది. అత్యంత సన్నిహితుడైన ధోనీ సిఫార్సు చేస్తే, ఫ్లెమింగ్ కాదనలేడని బీసీసీఐ భావిస్తుంది. దీంతో ఫ్లెమింగ్ను ఒప్పించే బాధ్యత తీసుకోవాలని ధోనీపై భారత క్రికెట్ బోర్డు ఒత్తిడి తీసుకురావడనికి ప్రయత్నిస్తోంది. మరి, బీసీసీఐ మాటను పరిగణించి ధోనీ ఫ్లెమింగ్ను ఒప్పిస్తాడా లేదా అని తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే. కాగా, టీమిండియాకు కొత్తగా ఎంపికయ్యే ప్రధాన కోచ్ పదవి కాలం మూడున్నరేళ్లు ఉంటుంది.

2027 డిసెంబర్ 31 వరకు కొనసాగుతారు. ప్రస్తుతం టీమిండియా హెడ్ కోచ్గా ఉన్న రాహుల్ ద్రవిడ్ పదవి కాలం రానున్న టీ20 ప్రపంచకప్ 2024తో ముగియనుంది. వాస్తవానికి 2023 వన్డే ప్రపంచకప్ అనంతరమే ద్రవిడ్ పదవి కాలం ముగిసింది. కానీ పొట్టి కప్పు దృాఎష్టిలో పెట్టుకుని ద్రవిడ్ పదవీ కాలాన్ని పొడగించారు.

# విజేతగా నిలిచేది కేకేఆరే

## జోస్యానికి కారణాలు ఇవే

ఐపీఎల్-2024లో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. టేబుల్ టాప్లో నిలిచిన తొలి రెండు జట్లు ఫైనల్ బెర్త్ కోసం పోటీపడుతున్నాయి. అహ్మదాబాద్ వేదికగా క్వాలిఫయర్-1లో కోల్కతా నైట్ రైడర్స్తో సన్రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. సమవుజ్జీలైన ఇరు జట్ల మధ్య ఇవాళ పోరు హోరాహోరీగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్లో గెలిచిన జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు క్వాలిఫయర్-2 మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. ఎలిమినేటర్ మ్యాచ్లో గెలిచిన జట్టుతో పోటీపడాల్సి వస్తుంది. అయితే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన కేకేఆర్ ఈ సీజన్లో కేవలం మూడు మ్యాచ్లోనే ఓడింది. మరోవైపు సన్రైజర్స్ మాత్రం అయిదింట్లో పరాజయాన్ని చవిచూసింది. అంతేగాక లీగ్ దశలో జరిగిన మ్యాచ్లో ఎస్ఆర్హెచ్పై కోల్కతాదే పైచేయి. ఈ గణాంకాలను బట్టి చూస్తే ఇవాళ కేకేఆర్ గెలుస్తుందని ఎక్కువమంది అంచనా వేస్తుంటారు. కానీ క్వాలిఫయర్-1లో కోల్కతాపై సన్రైజర్స్ విజయం సాధిస్తుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. తమ అభిప్రాయానికి నాలుగు కారణాలు కూడా వివరిస్తున్నారు. అందులో మొదటి కారణం.. కేకేఆర్ గత పది రోజులుగా మ్యాచ్లు ఆడలేకపోవడం అని చెబుతున్నారు. కోల్కతా జట్టు ఆడాల్సిన గత రెండు మ్యాచ్లు వర్షం కారణంగా రద్దయ్యాయి. మే 11న చివరిగా ఆడిన మ్యాచ్ కూడా వరుణుడి రాకతో 16 ఓవర్లకే కుదించారు. ఈ మ్యాచ్లో ముంబైపై కేకేఆర్ గెలిచింది. కానీ ఆ తర్వాత జట్టుగా ఆటగాళ్లంతా కలిసి బరిలోకి దిగలేకపోయారు. మరోవైపు ఎస్ఆర్హెచ్ మాత్రం జోరు మీదుంది. పంజాబ్ కింగ్స్పై 215 పరుగుల లక్ష్యాన్ని గెలిచి ఆత్మవిశ్వాసంతో ఉంది. ఇక రెండో కారణం.. సన్రైజర్స్ డేంజర్ బ్యాటింగ్ లైనప్.

ఈ సీజన్లో అత్యంత ప్రమాదకరమైన బ్యాటింగ్ లైనప్ ఎస్ఆర్హెచ్దే. అభిషేక్, ట్రావిస్ హెడ్ కుదురుకుంటే రికార్డుల బద్దలవ్వడం సాధారణంగా మారింది. వారిద్దరిలో ఒకరు వెంటనే ఔటైనా అదే జోరును కొనసాగించడానికి తాజాగా జట్టులోకి రాహుల్ త్రిపాఠి వచ్చాడు. హెన్రిచ్ క్లాసెన్, మార్క్రమ్, నితీశ్ రెడ్డి, అబ్దుల్ సమద్తో బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. ఇక మూడో కారణం.. కేకేఆర్ పేసర్ల కంటే సన్రైజర్స్ ఫాస్ట్ బౌలర్లే అనుభవజ్ఞులు. బౌండరీలు దూరంగా ఉండే అహ్మదాబాద్ మైదానంలో ఎస్ఆర్హెచ్ పేసర్లలో హిట్టింగ్ చేయడం




కోల్కతా బ్యాటర్లకు సవాలే. అంతేగాక అహ్మదాబాద్ పరిస్థితులు కెప్టెన్ ప్యాట్ కమిన్స్కు బాగా తెలుసు.

నాకౌట్ మ్యాచ్లో జట్టును ఎలా ముందుకు నడిపించాలో అతనికి బాగా తెలుసు. మరోవైపు కేకేఆర్ కెప్టెన్ శ్రేయస్ బ్యాటర్గా విఫలమవుతున్నాడు.నాలుగో కారణం.. ఫిల్ సాల్ట్ దూరమవ్వడం. కోల్కతా సాధించిన విజయాల్లో సాల్ట్ది కీలకపాత్ర. అతను కీలక సమయంలో దూరమవ్వడం జట్టుకు ప్రతికూలాంశమే.

# సురేష్ ప్రొడక్షన్స్ సెలబ్రేటింగ్ 60 గ్లోరియస్ ఇయర్స్

పద్మ భూషణ్, మూవీ మొఘల్, లెజెండరీ డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు గారు స్థాపించిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ అరవై ఏళ్ల అద్భుత సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకొని వైభవోత్స వాలు జరుపుకుంటోంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నిర్మాణ సంస్థగా ప్రేక్షకుల మన్ననలని పొందిన సురేష్ ప్రొడక్షన్స్ 60 సంవత్సరాల సుదీర్ఘ సినీ ప్రస్థానంలో శతాధిక చిత్రాలను ప్రేక్షకులకందించి చరిత్ర సృష్టించింది. ఎన్నో అద్భుతమైన చిత్రాలని నిర్మించి ప్రేక్షకులని విశేషంగా అలరిస్తున్న సురేష్ ప్రొడక్షన్స్ అన్ని భారతీయ భాషల్లో సినిమాలు నిర్మించి సంస్థగా అరుదైన ఘనత సాధించింది. 1964లో ప్రారంభమై, ఎన్నో కల్ట్ క్లాసిక్ హిట్స్, మోడరన్ మాస్టర్ పీస్ చిత్రాలతో గత ఆరు దశా బ్దాలుగా ప్రేక్షకులకు అద్భుత మైన సినిమాటిక్ ఎక్స్ పీరి యన్స్ పంచుతోంది. సురేష్ ప్రొడక్షన్స్ 60ఏళ్ళు పూర్తి చేసుకుని వైభవోత్సవాలు జరుపుకుం టున్న సందర్భంగా ఈ అద్భుత మైన సినీ ప్రయాణంలో భాగ మైన నటీనటు లకు, సాంకేతిక నిపుణులకు, ప్రేక్షకులకు, అభిమానులకు, మీడియాకు, ప్రతి ఒక్కరికీ నిర్మాణ సంస్థ కృతజ్ఞతలు తెలియజేసింది. రామానాయుడుగారి వారసత్వాన్ని ఆయన కుటుంబ సభ్యులు దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు.



# హరోం హర జూన్ 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల

సుధీర్ బాబు మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'హరోం హర' ప్రమోషన్స్ జోరందుకున్నాయి. ఆకట్టుకునే పాటలు, ఆసక్తిని రేకెత్తించే టీజర్, ప్రోమోలకు అద్భుత మైన స్పందనతో, సినిమాపై హ్యూజ్ హైప్ క్రియేట్ చేశాయి. సుధీర్ బాబు పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన మురుగన్ పాట, సునీల్తో అతని స్నేహాన్ని చూపించడం కూడా విశేషంగా ఆకట్టుకుంది. తాజాగా మేకర్స్ కొత్త విడుదల తేదీని అనౌన్స్ చేశారు. ముందుగా మే 31న రిలీజ్ ప్లాన్ చేసిన ఈ సినిమా జూన్ 14కి షిఫ్ట్ చేశారు. చేతిలో తుపాకీతో ఉన్న సుధీర్ బాబు బ్రాండ్ న్యూ పవర్ ఫుల్ పోస్టర్ ద్వారా ఈ వార్తను మేకర్స్ అధికారికంగా అనౌన్స్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జూన్ 14న నోటెడ్ సినిమా ఏదీ రానందున, హరోం హర సోలోగా విడుదల కానుంది. ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నారు. మాళవిక శర్మ కథానాయికగా నటిస్తుండగా ఎస్ఎస్సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్పై సుమంత్ జి నాయుడు నిర్మించిన ఈ చిత్రం చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో 1989లో జరిగిన పీరియాడికల్ ఫిల్మ్.



# అతిథుల్ని ఆకట్టుకున్న కన్నప్ప టీజర్

డైనమిక్ స్టార్ విష్ణు మంచు డ్రీమ్ ప్రాజక్ట్ కన్నప్ప తెర మీదకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ దాదాపుగా పూర్తి కావొస్తుంది. రీసెంట్గానే బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ మీద కొన్ని సీన్లను చూపించబోతున్నారు. మే 30న తెలుగులో కన్నప్ప టీజర్ను ముందుగా రిలీజ్ చేస్తామని విష్ణు మంచు ప్రకటించారు. ఈ మేరకు విష్ణు మంచు ఓ ట్వీట్ వేశారు. కేన్స్లో మా కన్నప్ప టీజర్ను అందరికీ చూపిం



చిత్రీకరించారు. ఆపై ప్రభాస్ మీద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. కేన్స్ ఫెస్టివల్లో కన్నప్ప టీం సందడి చేసింది. మోహ న్బాబు, విష్ణు మంచు, ప్రభుదేవా వంటి వారు కన్నప్ప కోసం కేన్స్ ఫెస్టివల్కు వెళ్లారు. ఇక అక్కడే కన్నప్ప టీజర్ను అందరికీ పరిచ యం చేశారు. కన్నప్ప టీజర్కు అక్కడి వారంతా ముగ్ధులయ్యారు. ఇక కన్నప్ప టీజర్ను ఇండియన్ ప్రేక్షకులకు చూపించేందుకు ముహూర్తాన్ని ఫిక్స్ చేశారు. జూన్ 13న ఇండియా వైడ్గా కన్నప్ప టీజర్ విడుదల కానుంది. కానీ అంతకు ముందే తెలుగు ప్రేక్షకులకు కన్నప్ప టీజర్ను చూపించాం. టీజర్ను చూసి అందరూ ప్రశంసించారు. ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూటర్లు, అక్కడికి వచ్చిన ఇండియన్స్ కన్నప్ప టీజర్ను చూసి ముగ్ధులయ్యారు. ఆ రెస్పాన్స్ చూసిన తరువాత నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు. మన ఇండియన్ ప్రేక్ష కులకు జూన్ 13న టీజర్ చూపించబోతున్నాం. మే 30న తెలుగు టీజర్ను హైద్రాబాద్లోని పాపులర్ థియేటర్లో ప్రదర్శించనున్నాం. మా కన్నప్పను సోషల్ మీడియాలో మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న కొంత మంది సెలెక్టెడ్ ఆడియెన్స్కు ఆ టీజర్ను చూపిస్తాం. మా టీం వారిని సెలెక్ట్ చేస్తుంది.

# జూన్ 7న థియేటర్లో ఓసి

కౌండిన్య ప్రొడక్షన్స్ పై బీవీస్ నిర్మాతగా, విష్ణు బొంపెల్లి దర్శకత్వంలో హరీష్ బొంపెల్లి, మాన్య సలాడి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం ఓసి. యూత్ ఫుల్ ఎంటర్టైనర్గా సినిమాలోకి రావాలని కొంతమంది యువకుల కథే ఓసి. శరవేగంగా నిర్మాణాంతరవు పనులను పూర్తి చేసుకుంటున్న ఓసి.. జూన్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ఓసి టీజర్ విశేష ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిత్ర పరిశ్రమలో స్టార్ల కొడుకులే హీరోలవుతారు అనే డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింప జేసేలా చేస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ఎలాంటి బ్యాగ్రౌండ్ లేని కుర్రాళ్ళు సినిమాలో రాణించారా లేదా అనేది తెలియాలంటే జూన్ 7 వరకు వేచి చూడాల్సిందే. మంచి నిర్మాణ విలువలతో, భారీ బడ్జెట్ తో ఎక్కడ కాంప్రమైజ్ అవ్వకుండా ఓసి చిత్రాన్ని తెరకెక్కించినట్టు మేకర్స్ తెలిపారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆక ట్టు క ు నే లా కథాకథను ఉంటుందని.. థియేటర్లో చూసే వీక్షకులను ఓసి కట్టిపడేస్తుందని చిత్ర యూనిట్ నమ్మకంగా ఉన్నారు. ఈ చిత్రానికి లక్ష్మీకిరణ్ కథ, సాయిరాం తుమ్మల పల్లి సినిమాటోగ్రఫీ అందించగా డాన్స్ మాస్టర్ సత్య కొరియోగ్రఫీ అందించగా, వంశీ ఎస్. అక్షర్ బ్యాండ్ సంగీతం సమకూరుస్తున్నారు. ఇంతకీ ఓసి అంటే ఏంటో చూడాలంటే జూన్ 7 వరకు వేచి ఉండాల్సిందే.



# ఘనంగా డర్టీ ఫెలో ప్రీ రిలీజ్

ఈ నెల 24న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న డర్టీ ఫెలో ఇండియన్ నేవీలో పనిచేసిన సోల్జర్ శాంతి చంద్ర హీరోగా నటిస్తున్న సినిమా డర్టీ ఫెలో. ఈ చిత్రంలో దీపిక సింగ్, సిమ్రితీ బతీజా, నిక్కిషా రంగ్ వాలా హీరోయిన్స్ గా కనిపించబోతున్నారు. డర్టీ ఫెలో చిత్రాన్ని గుడూరు భద్రకాళీ సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై జి శాంతి బాబు నిర్మిస్తున్నారు. ఆడారి మూర్తి సాయి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 24న గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ అవుతోంది. తాజాగా చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, హీరో సంపూర్ణేష్ బాబు గెస్ట్ లుగా పాల్గొన్నారు. ఈ



సందర్భంగా హీరో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ – శాంతి చంద్ర నాకు ఒక బ్రదర్ లాంటి వ్యక్తి. ఆయన మంచి వాడు. సినిమాకు డర్టీ ఫెలో టైటిల్ ఎందుకు పెట్టారని అడిగాను. ఈ సినిమాకు ఆ టైటిల్ తప్ప మరో ఛాయిస్ లేదని డైరెక్టర్ గారు చెప్పారు. సినిమా మీద ప్యాషన్ ఉన్న శాంతి చంద్ర అన్న హీరోగా ఈ మూవీ చేస్తుండటం సంతోషంగా ఉంది. డర్టీ ఫెలో సినిమా పాటలు, ట్రైలర్ చూశాను. మంచి కథతో వస్తున్న మూవీ ఇది. శాంతి చంద్ర అన్న తను కోరుకున్న అంశాలతో నచ్చిన విధంగా ఈ సినిమాను నిర్మించాడు. డాక్టర్ సతీష్గారి మ్యూజిక్ సూపర్బ్ గా ఉంటుంది. డర్టీ ఫెలో సినిమా మంచి హిట్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు. దర్శకుడు ఆడారి మూర్తి సాయి మాట్లాడుతూ – డర్టీ ఫెలో సినిమాకు పని చేసిన వాళ్లంతా ఒక కుటుంబంలా పనిచేశారు. మన ఇంట్లో వాళ్లను పొగడాల్సిన అవసరం లేదు. నేను చేసే రిక్వెస్ట్ ఒకటే. ఒకప్పుడు మన సినిమాలకు శతదినోత్సవాలు జరుపుకునేవాళ్లం. ఇప్పుడు రెండు రోజులకే సినిమా లైఫ్ ఫినిష్ అవుతూ జత దినోత్సవాలు జరుపుకునే పరిస్థితి వచ్చింది. టీవీ వచ్చాక సినిమా పనైపోయింది అన్నారు. పైరసీ వచ్చాక ఇక సినిమా బతకలేదన్నారు. అయినా ఇండస్ట్రీ తట్టుకుని ముందడుగు వేస్తూ వచ్చింది. కానీ ఇప్పుడు పైరసీ కాదు ప్రైవసీ జబ్బు వచ్చింది.

# పాయల్ రాజ్ పుత్ పై కంప్లైంట్ చేసిన రక్షణ ప్రొడ్యూసర్

ఆర్ఎక్స్100 సినిమాతో తెలుగులో పరిచయం అయినా హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ ఆ తరువాత కూడా తెలుగులో సినిమాలు బాగానే చేసారు. త్వరలోనే ఆమె లీడ్ రోల్ గా నటించిన రక్షణ అనే సినిమా రాబోతుంది అని మేకర్స్ స్పష్టం చేసారు. ఇది ఇలా ఉండగా ఈరోజు ఉదయం పాయల్ రాజ్ పుత్ తన సోషల్ మీడియా అయినా ద్వారా ఒక విషయం వెల్లడించారు. తనని రక్షణ సినిమా ప్రొడ్యూసర్ ప్రొమోషన్స్ చేయదానికి అడగగా తనకి వేరే సినిమాల డేట్ ల వాళ్ళ కుదరదు అని చెప్పినట్లు, దీనికై సినిమా ప్రొడ్యూసర్ తనని తెలుగు సినిమాలకు దూరం చేస్తాను అని బెదిరించినట్లు ఆ పోస్ట్ లో ఆమె తెలిపారు. ఇది ఇలా ఉండగా రక్షణ సినిమా ప్రొడ్యూసర్ డైరెక్టర్ అయిన శ్రీ ప్రాందీప్ ఠాకూర్ తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్ కౌన్సిల్లో కంప్లైంట్ చేసారు. కాగా తెలుగు ఫిలిం ప్రొడ్యూ సర్ కౌన్సిల్ ఒక ఆఫిషియల్ ప్రెస్ నోట్ విడుదల చేసారు.



# ఖురేషి అబ్రమ్ పాత్రలో మోహన్ లాల్

స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించే చిత్ర నిర్మాణ సంస్థగా లైకా ప్రొడక్షన్స్కి ఓ పేరుంది. తొలిసారి మలయాళ సినీ ఇండస్ట్రీలోకి లైకా ప్రొడక్షన్స్ ఓ భారీ బడ్జెట్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రమే 2 ఎంపురాన్. మలయాళ సూపర్ స్టార్ మోహన్లాల్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా లైకా ప్రొడక్షన్స్కి ఎంతో కీలకమైనదనే చెప్పాలి. దక్షిణాదిలో టాప్ యాక్టర్స్తో కలిసి ఓ కొత్త సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెడు తుండటం విశేషం. 2019లో విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన లూసిఫర్ చిత్రానికి సీక్వెల్గా2 ఎంపురాన్ రూపొందుతుంది. తొలి భాగం హిట్ కావటంతో సినిమాపై ఎలాంటి అంచనాలున్నాయో ముందుగానే అంచనా వేసిన మేకర్స్ ఎక్స్పెక్టేషన్స్కి మించేలా సినిమాను నిర్మిస్తున్నాయి. మోహన్ లాల్, వెర్సటైల్ యాక్టర్, డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కాంబినేషన్లో రానున్న మూడో చిత్రం కావటంతో అభిమానుల్లో సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఎగ్జయిట్మెంట్ ఇప్పటి నుంచే మొదలైంది. మోహన్లాల్ పుట్టినరోజు సందర్భంగా 2 ఎంపురాన్ లో ఖురేషి అబ్రమ్గా సూపర్స్టార్ లుక్ను మేకర్స్ విడుదల చేశారు. ఖురేషి పాత్రను పరిచయం చేయటంతో లూసిఫర్ సినిమా ముగుస్తుంది. 2 ఎంపురాన్ విషయానికి వస్తే ఆ పాత్రను మరింత విస్తృతంగా ఆవిష్కరించ బోతున్నారు. స్టీఫెన్ నెడుంపల్లి అసలు ఖురేషి అబ్రమ్గా ఎలా మారాడనే విషయాన్ని ఇందులో చూపించ బోతున్నారు. ఇన్స్టాగ్రామ్ వేదికగా పృథ్వీరాజ్ సుకుమార్ మోహన్ లాల్కు పుట్టినరోజు శుభాకాంక్షలను తెలియజేస్తూ 2 ఎంపురాన్ స్టైలిష్ పోస్టర్ను రిలీజ్ చేశారు. హ్యాపీ బర్త్ డే లాలెట్టా అంటూ మోహన్ లాల్పై తన ప్రేమాభిమానాలను పోస్టర్ ద్వారా వ్యక్తం చేశారు పృథ్వీరాజ్.



# త్వరలో అనుష్క, విజయశాంతి ప్రధాన పాత్రల్లో మూవీ నిర్మిస్తున్నా

అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి భారీ మెజార్టీతో గెలవబోతున్నానని తెలిపారు నిర్మాత ఎస్ కే బషీద్. 2007లో అల్లరి నరేష్, వేణు హీరోలుగా అల్లరే అల్లరి సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతగా తన ప్రస్థానం మొదలుపెట్టారు ఎస్ కే బషీద్. ఆ తర్వాత పలు చిత్రాలను నిర్మించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి తాను వచ్చానని, అయితే అడుగడుగున ఇబ్బందులకు గురిచేశారని ఎస్ కే బషీద్ చెప్పారు. రాజకీయంగా తను ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు, తన కొత్త సినిమా విశేషాలను ఈ రోజు హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు నిర్మాత ఎస్ కే బషీద్. నిర్మాత ఎస్ కే బషీద్ మాట్లాడుతూ – నేను అల్లరే అల్లరి సినిమాతో నిర్మాతగా చిత్ర పరిశ్రమకు వచ్చాను. వ్యాపారవేత్తగా, నిర్మాతగా కొనసాగుతున్నాను. గతంలో దర్శకుడు సురేష్ కృష్ణకు అడ్వాన్స్ ఇచ్చాను. ఆయన దర్శకత్వంలో విజయేంద్రప్రసాద్గారి కథతో అనుష్క, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేసుకుంటున్నాను. ఇంకా వారితో నేరుగా సంప్రదింపులు జరపలేదు. డిస్కషన్స్ చేయబోతున్నాం. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తారు. ఒక పాట కంపోజిషన్ జరుగుతోంది. నా రాజకీయ ప్రయాణం గురించి చెప్పాలంటే వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఏపీ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నాను. పార్టీ నన్ను గుర్తించి రాజంపేట పార్లమెంట్ సభ్యుడిగా టికెట్ ఇచ్చింది. నేను ప్రచారం చేసుకునేందుకు రాజంపేట వెళ్తే బీజేపీ నుంచి మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర రాజకీయ నాయకులు నన్ను చాలా ఇబ్బందులు గురి చేశారు అన్నారు.



# యక్షిణి అనౌన్స్ చేసిన డిస్నీ ప్లస్ హాట్ స్టార్

ఆర్కా మీడియా వర్క్స్, డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ది సూపర్ హిట్ కాంబినేషన్. ఈ సంస్థలు కలిసి చేసిన పరంపర, పరంపర 2 వెబ్ సిరీస్లు ప్రేక్షకుల్ని ఆకట్టుకుని విజయం సాధించాయి. ఇప్పుడు ఇదే కాంబోలో యక్షిణి అనే మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది డిస్నీ ప్లస్ హాట్ స్టార్. యక్షిణి వెబ్ సిరీస్ ను శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మిస్తున్నారు. వేదిక, మంచు లక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అర్జున ఫాల్గుణ, జోహార్, కోట బొమ్మాళి పీఎస్ వంటి సినిమాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న తేజ మార్ని యక్షిణి సిరీస్ ను రూపొందిస్తున్నారు. కృష్ణ, మాయ పాత్రలతో సోషియో ఫాంటసీ నేపథ్యాన్ని ఈ సిరీస్ కు ఎంచుకున్నారు దర్శకుడు తేజ మార్ని. ఫాంటసీ, రొమాన్స్, కామెడీ అంశాలతో రూపొందిన యక్షిణి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించ నుంది. డైరె క్టర్ తేజ మార్ని విజన్ కు తగినట్లు భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో ఆర్కా మీడియా వర్క్స్ ఈ సిరీస్ ను నిర్మించింది. జూన్ లో తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మల యాళ, హిందీలో యక్షిణి వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది.



# అందాల రకుల్ బ్లూ బికినీ

కన్నడ చిత్రం గిల్లి సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు లో ఈ అమ్మడు కెరటం సినిమా ద్వారా ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈమెకు సక్సెస్ ను తెచ్చి పెట్టిన సినిమా మాత్రం వెంకటాద్రి ఎక్స్ప్రెస్. ఆ సినిమా ఘన విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో ఇండస్ట్రీలో అందరి దృష్టిని ఆకర్షించింది. టాలీవుడ్ స్టార్ హీరోలు అయిన మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, ఎన్టీఆర్ లతో పాటు ఇంకా పలువురు ఇతర భాషల స్టార్స్ తో కూడా సినిమాలు చేసి సౌత్ స్టార్ హీరోయిన్ గా పేరు దక్కించుకుంది. బాలీవుడ్ లో కూడా ఈమె సందడి కొనసాగింది. ఈ మధ్య కాలంలో కాస్త ఆఫర్లు తగ్గినా కూడా సోషల్ మీడియాలో మాత్రం ఈమె జోరు కంటిన్యూ అవుతుంది. ఓ రేంజ్ అందాల ఆరబోత చేస్తూ ఫోటోలకు ఫోజ్ లు ఇస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అందాల సముద్రపు అందం మధ్య రకుల్ ప్రీత్ సింగ్ బ్లూ బికినీ లో అంతకు మించి అన్నట్లుగా అందంగా కనిపిస్తూ చూపరులను ఆకర్షిస్తుంది. పెళ్లి తర్వాత కూడా ఈ అమ్మడి అందం ఏమాత్రం తగ్గలేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత మళ్లీ హీరోయిన్ గా బిజీ అయ్యింది. అలాగే రకుల్ కూడా లేడీ ఓరియంటెడ్ సినిమాలకు ఓకే చెప్పడం ద్వారా ఇండస్ట్రీలో బిజీ అయితే బాగుంటుంది కదా అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి సోషల్ మీడియాలో మాత్రం అందాల షో ఓ రేంజ్ లో చేస్తుంది.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.